# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ 25.04.2025 | 24 క్యారెట్లు 87,215.00 | కిలో వెండి 1,07,456.00 | 32 °C | సంపుటి:3 | సంచిక:174

www.vishalabharati.com


# 1000 మంది మావోయిస్టులు vs 20వేల బలగాలు

- ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఆపరేషన్
- కర్రెగుట్టలను చుట్టుముట్టిన బలగాలు
- డ్రోన్లు, హెలికాప్టర్ల సహాయంతో నిరంతరం గాలింపు
- భారీ ఆపరేషన్‌తో దండకారణ్య గ్రామాలల్లో టెన్షన్ టెన్షన్
- బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్ ఐదుగురు మావోయిస్టులు మృతి

తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులోని దండకారణ్యం ప్రాంతంలో మావోయిస్టుల ఏరివేత కొనసాగుతున్నది. బీజాపుర్ అడవుల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు నక్కిఉన్నారన్న పక్కా సమాచారంతో భద్రతా బలగాలు గత మూడు రోజులుగా కూంబింగ్ చేపడుతున్నాయి. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పరిధిలోని కర్రెగుట్టల్లో పెద్ద ఎత్తున కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో అడవిలో దాదాపు 1000 మంది మావోయిస్టులను సుమారు 20వేల మంది భద్రతా సిబ్బంది చుట్టుముట్టినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది.



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:** కర్రెగుట్ట పరిసర ప్రాంతాల్లో వెయ్యి మంది మావోయిస్టులు నక్కి ఉన్నారన్న సమాచారం ఉంది. వీరిలో హిడ్మా సహా పలువురు అగ్రనేతలు ఉన్నారన్న పక్కా నిఘా సమాచారంతో బలగాలు ఈ ఆపరేషన్ ముమ్మరం చేశాయి. మావోయిస్టులు తలదాచుకున్న ప్రాంతాలను పూర్తిగా చుట్టుముట్టి, డ్రోన్లు, హెలికాప్టర్ల సహాయంతో నిరంతరం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. 'బచావో కర్రెగుట్టలు' పేరుతో స్పెషల్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. 250 కిలోమీటర్ల మేర విస్తరించిన కర్రెగుట్టలను వేలాదిమంది బలగాలు పూర్తిగా ఆధీనంలోకి తీసుకున్నట్టు తెలుస్తున్నది. మావోయిస్టుల కదలికల ప్రచారం, పోలీసుల కూంబింగ్‌తో ఏజెన్సీలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. డీఆర్‌జీ బస్తర్ ఫైటర్ కోబ్రా, సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్ సైనికులతో పాటు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర పోలీసులు రాత్రి, పగలు తేడా లేకుండా డ్రోన్లు, హెలికాప్టర్ల ద్వారా అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. ఈ భారీ ఆపరేషన్‌తో భీమవరం పాడు, పూజారి కాంకేర్, పామేడు, ఊసూరు వంటి సరిహద్దు గ్రామాల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. తుపాకీ శబ్దాలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం అటవీ ప్రాంతంలో భారీ ఆపరేషన్ కొనసాగుతోంది. ఈ ఆపరేషన్ నేపథ్యంలో బీజాపూర్ జిల్లా

..మిగతా 2 లో

# ఉగ్రవాదులను మట్టిలో కలిపేస్తాం

- ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తాం
- హెచ్చరించిన భారత ప్రధాని నరేంద్ర మోడీ
- ఉగ్రమూకల వెన్నెముకను 140కోట్ల మంది విరిచేస్తారని వ్యాఖ్య
- ఉగ్రదాడికి పాల్పడిన వారు భారీ మూల్యం చెల్లించుకుంటారు
- ఉగ్రవాదంతో భారత ఐకమత్య స్ఫూర్తిని బద్దలుకొట్టలేరు
- దేశానికి అండగా నిలిచిన విదేశాలకు ప్రధాని కృతజ్ఞతలు



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:** పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడ్డ ముష్కరులకు ఊహించని రీతిలో శిక్షిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తామని, వారిని మట్టిలో కలిపి సమయం ఆసన్నమైందన్నారు. ఇది పర్యటకులపై జరిగిన దాడి కాదని, భారత్ ఆత్మపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, వెంటాడి భారత్ హత మారుస్తుందని స్పష్టం చేశారు. మృతులకు ప్రధాని నివాళులు

..మిగతా 2 లో




# దిల్లీలో పాకిస్థాన్ హైకమిషన్ ముట్టడికి యత్నం

- భారత్‌లో జరిగే ఉగ్రవాద కార్యకలపాలకు పాక్ మద్దతు
- పాకిస్థాన్ వ్యతిరేక నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శన
- పహల్గాం ఉగ్రదాడి పిరికిపంద చర్య

..మిగతా 2 లో

# పాకిస్థానీలకు వీసాల తక్షణ రద్దు

- పహల్గామ్ నేపథ్యంలో భారత్ చర్య
- పాకిస్థాన్‌లో ఉంటున్న భారతీయులంతా స్వదేశానికి రండి




..మిగతా 2 లో



# భారత్ సమ్మిట్.. శాంతి, సమానత్వం, ఆర్థికతపై చర్చల వేదిక

- 100 దేశాల ప్రతినిధులతో తెలంగాణకు గ్లోబల్ గుర్తింపు
- పహల్గామ్ ఉగ్రదాడిపై కాంగ్రెస్ తీవ్ర నిరసన, భద్రతపై దృష్టి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

..మిగతా 2 లో



# మోదీ.. సమరశంఖం పూరించు

- మోడీ నిర్ణయాన్ని సమర్థిస్తామన్న రాహుల్ గాంధీ, ఖర్గే
- ఉగ్రదాడిని తీవ్రంగా వ్యతిరేకించిన ఆల్ పార్టీ నేతలు
- నేడు జమ్మూకశ్మీర్‌లో రాహుల్‌గాంధీ పర్యటన

2 లో

# కాంగ్రెస్ పాలనలో పల్లె కన్నీరు పెడుతోంది

- సమైక్య పాలనలో దశాబ్దాలపాటు దగాపడ్డ పల్లెలు
- కేసీఆర్ సంకల్పంతో ప్రతి పల్లెసీమ ప్రగతిసీమగా మారింది
- నాడు పదేళ్లపాటు మురిసిన పల్లె,
- కాంగ్రెస్ పాలనలో నేడు మళ్లీ కన్నీరు పెడుతోంది.
- గ్రామాల్లో కనీస వసతులు లేవు.
- పల్లె ప్రజలకు గుక్కెడు మంచినీళ్లు దిక్కు లేవు.'
- రాష్ట్రంలో పంచాయతీ సిబ్బందికి వేతనాలు లేవు.
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:** బీఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేసీఆర్ తన పదేళ్ల పాలనలో ఉద్యమ నినాదాలను నిజం చేశారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గ్రామస్వరాజ్యం కోసం జాతిపిత మహాత్మాగాంధీ కన్న కలలను కూడా సాకారం చేశారని చెప్పారు. ఇవాళ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కేటీఆర్.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన పల్లె ప్రగతిని గుర్తుచేస్తూ తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు.పోస్టులో కేటీఆర్.. 'పదేళ్ల పాలనలో ఉద్యమ నినాదాలను నిజం చేయడమేగాక గ్రామస్వరాజ్యం కోసం జాతిపిత మహాత్ముడు కన్న కలలను కూడా తెలంగాణ తొలి

2 లో



# కుంభమేళా తరహాలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ

- కాంగ్రెస్‌ది చేతగాని తనం ప్రజలకు తెలిసొచ్చింది
- 16 నెలల కాంగ్రెస్ పాలనలో 16 పనులు కూడా కాలేదు
- దేశ సేవకే టీఆర్ఎస్ బీఆర్ఎస్ గా రూపాంతరం చెందింది
- ప్రభుత్వ పిచ్చి మాటలు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోం
- తెలంగాణ ప్రజల విజయాన్ని ప్రపంచానికి చాటడానికే బీఆర్ఎస్ రజతోత్సవ సభ: ఎమ్మెల్సీ కవిత

..మిగతా 2 లో

# అఘోరీని అరెస్ట్ చేసిన పోలీసులు

- మహిళ దగ్గర పూజలు చేయాలని చెప్పి రూ.9.80 లక్షలు వసూలు
- దీంతో మహిళా పిర్యాదు
- చేవెళ్ల కోర్టుకు తరలించగా 14 రోజుల రిమాండ్ విధించిన న్యాయస్థానం

2 లో

# పెహల్గామ్ ఉగ్రదాడి పిరికిపంద చర్య

- దాడి సూత్రధారి పాకిస్థాన్
- ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి
- ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపిన సీడబ్ల్యూసీ
- ప్రస్తుత విషాద పరిస్థితి బీజేపీ విద్వేషానికి వాడుకుంటోంది
- పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:** పెహల్గామ్ ఉగ్రదాడి పిరికిపంద చర్య అని, ఈ దాడి సూత్రధారి పాకిస్థాన్ అని కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నది. గణతంత్ర విలువలపై నేరుగా జరిగిన దాడి అని ఆ పార్టీ ఆరోపించింది. పెహల్గామ్ దాడిని ఖండిస్తూ గురువారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
25.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



vishalabharathi Telugu Daily



## రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు నోటీసులు

విశాలభారతి,స్టేట్ బ్యూరో: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం పరిధిలోని భూదాన్ భూములకు సంబంధించిన వివాదంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ భూముల్లో అక్రమాలు జరిగాయని, పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్ పై న్యాయస్థానం విచారణ చేపట్టింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ భూములపై ఎలాంటి లావాదేవీలు జరపవద్దని స్పష్టం చేసింది. ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వంతో పాటు ఈడీ, సీబీఐ, పిటిషన్‌లో పేర్కొన్న అధికారులు, వారి కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేసింది. మహేశ్ అనే వ్యక్తి ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. నాగారం గ్రామంలోని భూదాన్ భూములను కొందరు ఉన్నతాధికారులు తమ పలుకుబడిని ఉపయోగించి, చట్టవిరుద్ధంగా బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, వారి కుటుంబసభ్యులను ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, భూదాన్ భూముల అక్రమాలపై ప్రభుత్వానికి, భూదాన్ బోర్డుకు గతంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ వ్యవహారంలో నిజానిజాలు తేలాలంటే సీబీఐ లేదా ఈడీ వంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని కోరారు.

# 1000 మంది మావోయిస్టులు vs 20వేల బలగాలు

తరువాయి భాగం

ధర్మతాళ్లగూడెం అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మరణించారు. మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో ధర్మతాళ్లగూడెం అటవీప్రాంతంలో భద్రతా బలగాలు, స్థానిక పోలీసులు సంయుక్తంగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు తారసపడిన మావోయిస్టులు.. కాల్పులు జరిపారు. ప్రతిగా భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రాంతంలో ఇంకా గాలింపు కొనసాగుతోంది. మృతుల సంఖ్యమ మరింత పెరిగే అవకాశం ఉన్నది.వచ్చే మార్చి నాటికి దేశంలో నక్సల్స్‌ను పూర్తిగా అంతం చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించిన విషయం తెలిసిందే. నక్సలైట్లు కేవలం నాలుగు జిల్లాలకే పరిమితమై ఉన్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు నక్సల్స్ అంతం అవుతారని తెలిపారు. నక్సల్స్‌ను రూపుమాపడంలో.. సీఆర్పీఎఫ్ వెన్నుముకగా నిలిచినట్లు ఆయన చెప్పారు. గత వారం అమిత్ షా చేసిన ఈ ప్రకటనతో ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్ ముమ్మరమైంది.

# ఉగ్రవాదులను మట్టిలో కలిపేస్తాం

తరువాయి భాగం



ఈ మేరకు గురువారం బిహార్ మధుబనిలో పంచాయతీరాజ్ దినోత్సవంలో పాల్గొన్న మోదీ, పహల్గాం ఉగ్రదాడిపై తొలిసారి మాట్లాడారు. ఉగ్రవాదులకు కలలో కూడా ఊహించని శిక్ష విధిస్తామని హెచ్చరించారు. ఉగ్రదాడికి పాల్పడిన వారు భారీ మూల్యం చెల్లించుకుంటారని పేర్కొన్నారు. తొలుత తన ప్రసంగం ఆరంభంలో పహల్గాం మృతులకు ప్రధాని నివాళులర్పించారు. మోదీతో పాటు సభలోని వారంతా ఒక నిమిషం పాటు మౌనం పాటించి అంజలి ఘటించారు.

**ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది విరిచేస్తారు**

కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉందని మోదీ తెలిపారు. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని కోల్పోయిందని, ఓ సోదరికి జీవిత భాగస్వామి దూరమయ్యాడని అన్నారు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతి ఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయని చెప్పారు. బాధితులకు న్యాయం చేసేందుకు ప్రతి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉందని చెప్పారు. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది విరిచేస్తారని మోదీ హెచ్చరించారు.

**ఐకమత్య స్ఫూర్తిని బద్దలుకొట్టలేరు**

అదే సమయంలో భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ తమకు అండగా నిలిచారని అన్నారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉగ్రవాదంతో భారత ఐకమత్య స్ఫూర్తిని బద్దలుకొట్టలేరని మోదీ స్పష్టం చేశారు. ఏప్రిల్ 22న పహల్గాంలోని ప్రముఖ పర్యటక ప్రాంతమైన బైసరన్‌లో ముష్కరులు జరిపిన దాడిలో 26 మంది మరణించిన విషయం తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన వారు పర్యటకులను చుట్టుముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు ముష్కరులు.

# కుంభమేళా తరహాలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ



విశాలభారతి,స్టేట్ బ్యూరో:

తెలంగాణ ప్రజలకు శ్రీరామ రక్షగా నిలబడేది గులాబీ జెండా మాత్రమేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ బాగుండాలని బీఆర్ఎస్ నాయకులు కోరుకుంటారని.. కానీ కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాత్రం తమకు ఓట్లు బాగా రావాలని అనుకుంటున్నారని విమర్శించారు. ఆ రెండు పార్టీలు ప్రజల మధ్య చీలక తీసుకొచ్చి ఓట్లు పొందేందుకు ప్రయత్నాలు చేస్తుంటాయని మండిపడ్డారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ప్రాంగణాన్ని పార్టీ శ్రేణులతో కలిసి గురువారం నాడు ఎమ్మెల్సీ కవిత పరిశీలించారు.కాంగ్రెస్‌ది చేతగాని ప్రభుత్వమని ప్రజలకు తెలిసిపోయిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 16 నెలల కాంగ్రెస్ పాలనలో 16 పనులు కూడా కాలేదని విమర్శించారు. దేశానికే సేవలు అందించడానికి టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్ పార్టీగా రూపాంతరం చెందామని వివరించారు. పరిణితి చెందడం ప్రకృతి ధర్మమని అన్నారు. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీగా మారిందంటే అది ప్రజల కోరుకున్న రెవల్యూషన్ అని చెప్పారు. రజతోత్సవం ఎందుకు చేసుకుంటున్నారని కొంతమంది వెకిలి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు అవాకులు, చెవాకులు, పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. కాంగ్రెస్ నేతలు మాట్లాడే మాటలను ప్రజలు క్షమించరని చెప్పారు.

బీఆర్ఎస్ పార్టీలోని మహిళా నాయకత్వాన్ని పటిష్టం చేయడానికి కేసీఆర్ రోడ్ మ్యాప్ ఇచ్చారని ఎమ్మెల్సీ కవిత అన్నారు.తెలంగాణ ప్రజల విజయాన్ని ప్రపంచానికి చాటడానికే బీఆర్ఎస్ రజతోత్సవ సభ అని చెప్పారు. తెలంగాణ అస్తిత్వం కోసం 2001లో కేసీఆర్ పడికిలి బిగించి ఉద్యమాన్ని మొదలుపెట్టారని గుర్తుచేశారు. ఉద్యమం మొదలుపెట్టినప్పుడు ఉత్పన్నమైన అన్ని అనుమానాలను కేసీఆర్ పటాపంచలు చేశారన్నారు. ఒక రక్తం చుక్క కూడా చిందించకుండా రాష్ట్రాన్ని సాధించిన ధీరుడు కేసీఆర్ అని కొనియాడారు.ఎన్ని అవాంతరాలు ఎదురైనా గుండె ధైర్యంతో బీఆర్ఎస్ పార్టీని, తెలంగాణను కాపాడుతూ వచ్చారని అన్నారు. తెలంగాణ ఉట్టిగనే రాలేదు--- కేసీఆర్ మేధస్సును కరిగిస్తే వచ్చిందని అన్నారు. తెలంగాణ రాజకీయ కుట్రలను చేధించి తెలంగాణ వాదాన్ని ప్రజల్లో నిలబెట్టారని అన్నారు. తెలంగాణ నవ యువకుల కోసం రజతోత్సవ సభ జరుగుతుందని స్పష్టం చేశారు. సభకు యువత పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కుంభమేళా తరహాలో రజతోత్సవ సభ జరగబోతుందని చెప్పారు.మహిళలకు నెలకు 2500, తులం బంగారం, స్కూటీలు ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని కవిత విమర్శించారు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన ప్రతీ ఒక్కరు సభకు రావాలని ఆహ్వానించారు. మహిళా సాధికారతకు కేసీఆర్ బాటలు వేశారని.. మున్సిపాలిటీల్లో, మార్కెట్ కమిటీల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించారని.. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఆడబిడ్డల కోసం ప్రతి జిల్లాలో హాస్టల్‌తో కూడిన డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేశారని తెలిపారు. కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ వంటి విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. మహిళలు భారీ ఎత్తున సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. రైతులు గుండెలపై చేయి వేసుకొని పడుకునే పరిస్థితిని కేసీఆర్ సృష్టిస్తే.. కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టి లక్షలాది ఎకరాలు ఎండిపోయేలా చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రైతులంతా గులాబీ దండులా రజతోత్సవ సభకు కదలిరావాలని కోరారు. తెలంగాణలోని ప్రజాస్వామ్యులంతా కూడా సభకు కదిలిరావాలని.. సోషల్ మీడియా సైనికులు కూడా హాజరుకావాలని పిలుపునిచ్చారు.

# పాకిస్థానీలకు వీసాల తక్షణ రద్దు

**- పహల్గామ్ నేపథ్యంలో భారత్ చర్య**

**- పాకిస్థాన్‌లో ఉంటున్న భారతీయులంతా స్వదేశానికి రండి**

విశాలభారతి,స్టేట్ బ్యూరో:

భారత ప్రభుత్వం తక్షణ చర్యలలో భాగంగా పాకిస్థానీ జాతీయులకు వీసాలను రద్దు చేసింది. పాకిస్థాన్‌లో ఉంటున్న భారతీయులంతా అందుబాటులో ఉన్న రవాణా ఏర్పాట్ల ద్వారా స్వదేశానికి వచ్చేయాలని తెలిపారు. ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువడింది. భద్రతా వ్యవహారాల కేబినెట్ సబ్ కమిటీ పూర్తి స్థాయి సమీక్షలో ఈ వీసా రద్దు నిర్ణయం కూడా ఒక్కటి. పాకిస్థానీయులకు ఇప్పటివరకూ ఉన్న వీసాల ప్రక్రియను శాశ్వత రీతిలో రదుద చేసినట్లుగా భావించుకోవల్సి ఉంటుందని విదేశాంగ మంత్రిత్వ వాఖ తమ ప్రకటనలో తెలిపింది. ఇక వైద్య చికిత్సలకు భారతదేశాని రావాలనుకనే వారికి జారీ చేసే ప్రత్యేక తరహా మెడికల్ వీసాలు ఆ నెలాఖరు వరకూ చెల్లుతాయి. భారతీయ పౌరులు ఎవరు కూడా పాకిస్థాన్‌లో పర్యటించరాదు. వివిధ కారణాలతో పాకిస్థాన్‌కు వెళ్లిన భారతీయులు ఏదో విధంగా వెంటనే తిరిగి రావాల్సి ఉందని కూడా స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ పాలనలో పల్లె కన్నీరు పెడుతోంది

తరువాయి భాగం

ముఖ్యమంత్రి కేసీఆర్ సాకారం చేశారు. ఇవాళ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటున్న వేళ.. పల్లెసీమలే దేశానికి పట్టుగొమ్మలన్న మహాత్మా గాంధీ ఆశయాలే స్ఫూర్తిగా బీఆర్ఎస్ పాలనలో ప్రాణం పోసిన 'పల్లెప్రగతి'ని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. సమైక్య పాలనలో దశాబ్దాలపాటు దగాపడ్డ పల్లెలను దర్జాగా కాలర్ ఎగరేసుకునే స్థాయికి తీర్చిదిద్దిన సందర్భాలు అపూర్వం. అనితర సాధ్యం.' అని పేర్కొన్నారు. సమస్యల సుడిగుండంలో విలవిలలాడిన ప్రతి పల్లె నాడు సకల సౌకర్యాల హరివిల్లైంది. కేసీఆర్ సంకల్పంతో ప్రతి పల్లె సీమ ప్రగతిసీమగా మారింది. ప్రతి పల్లెలో డంప్ యార్డు తప్ప.. చెత్త కంపు లేని స్థితి వచ్చింది. కూలిపోయే స్థితి ఉన్న ఖాళీ ఇండ్ల కిరికిరి నుంచి పొంగిపొర్లే మురికి కాలువల శుభ్రత వరకూ ప్రతి సమస్యకు పదేళ్ల పాలనలో శాశ్వత పరిష్కారం దొరికింది. కలుషిత నీటి కలకలం లేకుండా, సీజనల్ రోగాల చింతలేకుండా సాగిన పంచాయతీల ప్రస్థానం గ్రామ స్వరాజ్యంలో ఓ స్వర్ణ యుగం.' అని కేటీఆర్ రాసుకొచ్చారు. పచ్చదనానికి కొదవ లేకుండా, నిధులకు కొరత లేకుండా, విధులకు ఆటంకం లేకుండా, ప్రతి ఊరును మెరుగైన జీవనానికి మారుపేరుగా మార్చింది కేసీఆర్ విజనే. దేశంలో 3 శాతం జనాభా ఉన్న తెలంగాణ, పల్లెప్రగతిలో 30 శాతం అవార్డులను గెలుచుకోవడం పల్లె ప్రగతిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరి విజయం. నాడు పదేళ్లపాటు మురిసిన పల్లె, కాంగ్రెస్ పాలనలో నేడు మళ్లీ కన్నీరు పెడుతోంది. కాంగ్రెస్ పాలనలో గ్రామస్వరాజ్యం పూర్తిగా గాడితప్పింది. ఏడాదిన్నర గడిచినా స్థానిక సంస్థలకు ఎన్నికలు లేవు. 15వ ఆర్థిక సంఘం నిధులు లేవు. గ్రామాల్లో కనీస వసతులు లేవు. పల్లె ప్రజలకు గుక్కెడు మంచి నీళ్లు దిక్కు లేవు.' అని కేటీఆర్ నేటి దుస్థితిని వివరించారు.చివరికి రాష్ట్రంలో పంచాయతీ సిబ్బందికి వేతనాలు లేవు. ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు లేవు. మాజీ సర్పంచ్‌ల బిల్లులకే మోక్షం లేదు. దేశంలోనే ఆదర్శ గ్రామాలకు చిరునామాగా నిలిచిన తెలంగాణ పల్లెలు అధ్వాన పరిస్థితులకు అడ్రస్‌గా మారడం అత్యంత బాధాకరం. ఢిల్లీ పార్టీలను నమ్మిన పాపానికి పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిన తీరును తెలంగాణ పల్లె ప్రజలు గమనిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉండి తీవ్ర అన్యాయం చేస్తున్న బీజేపీకి, పచ్చని పల్లెలను సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ పార్టీకి జనం కర్రుకాల్చి వాతపెడుతరు.' అని హెచ్చరించారు.

# దిల్లీలో పాకిస్థాన్ హైకమిషన్ ముట్టడికి యత్నం

విశాలభారతి,స్టేట్ బ్యూరో:

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో దిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్ సమీపంలో 500 పైగా నిరసకారులు ఆందోళన చేపట్టారు. తొలుత ముట్టడికి యత్నించగా బలగాలు అడ్డుకున్నాయి. భారత్‌లో జరిగే ఉగ్రవాద కార్యకలాపాలకు పాక్ మద్దతు ఇస్తుందని ఆరోపించిన నిరసకారులు ప్లకార్డులు పట్టుకుని ఆ దేశ వ్యతిరేక నినాదాలు చేశారు. గురువారం తీన్ మూర్తి చౌక్ నుంచి పాకిస్థా హై కమిషన్ వరకు ఈ నిరసనలు చేపట్టారు. ఉదయం 11 గంటల నుంచే ప్రజలు భారీగా తరలివచ్చి ఆందోళనల్లో పాల్గొన్నారు. ప్లకార్డులు పట్టుకుని పాకిస్థాన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పాకిస్థాన్పై వెంటనే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాయాది దేశానికి సరైన గుణపాఠం చేప్పాలని అన్నారు. ఈ నిరసనల్లో బీజేపీ కార్యకర్తలు, యాంటీ టెర్రర్ యాక్షన్ ఫోరం వంటి సామాజిక సంస్థలు సహా బీజేపీ కార్యకర్తలు ఈ నిరసనల్లో పాల్గొన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి సర్జికల్ స్ట్రైక్ లాంటి చర్యలు తీసుకోవాలని కోరారు. పహల్గాం ఉగ్రదాడి అమాయక పర్యాటకులపై జరిగిన పిరికిపంద చర్యగా నిరసనకారులు తెలిపారు.ఈ నిరసనల నేపథ్యంలో దిల్లీ పోలీసులు తీన్ మూర్తి చౌక్ నుంచి పాకిస్థాన్ హై కమిషన్ వరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దిల్లీ పోలీసులను, ఆర్మీ సిబ్బందిని పెద్ద సంఖ్యలో మోహరించారు. వారిని అడ్డుకునేందుకు కార్యాలయానికి 500 వందల మీటర్ల దూరంలో బారికేడ్లును ఏర్పాటు చేశారు. ఆ బారికేడ్లను దూకి పాకిస్థాన్ హై కమిషన్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకుని వారిని బస్సులో ఎక్కించి తీన్ మూర్తి వద్దకు తిరిగి పంపించారు.



# భారత్ సమ్మిట్.. శాంతి, సమానత్వం, ఆర్థికతపై చర్చల వేదిక

హైదరాబాద్, విశాలభారతి:

తెలంగాణ డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తదుపరి నిర్వహించనున్న భారత సమ్మిట్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమ్మిట్‌లో శాంతి, అహింస, ఆర్థికం, సమానత్వం వంటి కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయని వివరించారు. ఈ అంశాలు కాంగ్రెస్ పార్టీ మూలవిధానాలకు అనుగుణంగా ఉంటాయని ఆయన తెలిపారు. భారత్ సమ్మిట్‌ని కాంగ్రెస్ పార్టీ యొక్క మూలవిధానాలను ప్రతిబింబిస్తూ నిర్వహిస్తున్నామని, ఇందులో వివిధ దేశాలకు చెందిన నాయకులు, మేధావులు, వ్యాపారవేత్తలు పాల్గొంటున్నారని భట్టి విక్రమార్క చెప్పారు.తెలంగాణ రాష్ట్రం గ్లోబల్ స్థాయిలో కీలకమైన అంశాలను చర్చించే బాధ్యతను తీసుకుంటుందని చెప్పారు. 100 దేశాలకు చెందిన 450 మంది ప్రతినిధులు ఈ సమ్మిట్‌లో పాల్గొంటారని, ఇది తెలంగాణకు గర్వకారణంగా ఉంటుందన్నారు భట్టి. ఈ సమ్మిట్ నిర్వహించడం తెలంగాణకు గొప్ప అదృష్టమని భట్టి విక్రమార్క అన్నారు.పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన భట్టి విక్రమార్క.. ఈ దాడి నుండి ప్రపంచానికి చెందిన ప్రతి ఒక్కరు నిస్సహాయంగా బాధపడుతున్నారని మనం గుర్తించాలన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. భారత్ సమ్మిట్ నిర్వహించడం తెలంగాణకు గొప్ప గౌరవమని, హైదరాబాద్‌కు గ్లోబల్ లెవల్ ఇమేజ్ వస్తోందని చెప్పారు. భారత్ సమ్మిట్ అనేది చారిత్రాత్మక కార్యక్రమమని, 100 దేశాల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి రావడం చారిత్రాత్మకమైన విషమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు. భారత్ సమ్మిట్ ప్రధానంగా.. శాంతి, అహింస, ఆర్థికం, సమానత్వం పై చర్చలు జరుగనున్నాయి. వివిధ దేశాలకు చెందిన నాయకులు, మేధావులు, వ్యాపారవేత్తలు పాల్గొంటున్నారు. 100 దేశాలకు చెందిన 450 మంది ప్రతినిధులు సమ్మిట్‌లో పాల్గొంటారు. ఈ సమ్మిట్ తెలంగాణ రాష్ట్రానికి గ్లోబల్ స్థాయిలో గుర్తింపు తీసుకురానుంది

# భారతీయ ముస్లింలకు అసదుద్దీన్ ఒవైసీ పిలుపు, పాకిస్తాన్‌పై ఆగ్రహం

హైదరాబాద్, విశాలభారతి:

జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిన నేపథ్యంలో, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. ఈ ఘాతుకాన్ని తీవ్రంగా ఖండిస్తూ, శుక్రవారం ప్రార్థనల సందర్భంగా ముస్లింలందరూ నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఉగ్రదాడి అంశంపై కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలోనూ ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఉగ్రవాదుల హేయమైన చర్యకు నిరసనగా రేపటి (శుక్రవారం) ప్రార్థనల్లో ముస్లింలు పాల్గొనాలని, ఆ సమయంలో నల్ల రిబ్బన్లు ధరించాలని అసదుద్దీన్ ఒవైసీ కోరారు. తమ నిరసనను శాంతియుతంగా తెలియజేయాలని సూచించారు. పాకిస్తాన్ అన్ని నిబంధనలను తుంగలో తొక్కిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం పాకిస్తాన్ మీద ఎలాంటి చర్యలు తీసుకున్నా సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. పహల్గాంలో జరిగిన దాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొంటూ, ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఏ మతమూ ఇలాంటి దాడులను సమర్థించదని, శాంతికి ప్రతీక అయిన ఇస్లాం మతం కూడా హింసకు, దాడులకు వ్యతిరేకమని ఆయన స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడి ఘటనపై కేంద్ర ప్రభుత్వం గురువారం అఖిల పక్ష సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి వివిధ పార్టీల అగ్ర నేతలతో పాటు అసదుద్దీన్ ఒవైసీ కూడా హాజరయ్యారు.

# అఘోరీని అరెస్ట్ చేసినపోలీసులు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కొన్ని నెలలుగా తెలుగు రాష్ట్రాల్లో వివిధ కార్యక్రమాలతో కలకలం సృష్టించిన అఘోరీ అలియాస్ అల్లూరి శ్రీనివాస్‌ను సైబరాబాద్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మంచిర్యాల జిల్లా కృష్ణపల్లికి చెందిన అఘోరీ అలియాస్ శ్రీనివాస్ రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరులోని ప్రగతి రిసార్ట్స్‌లో ఉండే మహిళ దగ్గర పూజలు చేయాలని చెప్పి రూ.9.80 లక్షలు వసూలు చేశారు. పూజకు మరిన్ని డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో మహిళ మోసపోయానని గ్రహించింది. దీంతో మోకిల పోలీసులకు ఫిబ్రవరిలో ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది.ఈ కేసు దర్యాప్తులో ఉండగానే అఘోరీ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువతిని పెళ్లి చేసుకుని రాష్ట్రం విడిచి వెళ్లాడు. సైబరాబాద్ పోలీసులు అఘోరీని పట్టుకోవడానికి స్పెషల్ బృందాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలతో ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బుధవారం నగరానికి తీసుకొచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం చేవెళ్ల కోర్టుకు తరలించగా, 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. దీంతో సంగారెడ్డి జిల్లాలోని కంది సబ్ జైలుకు తరలించారు. అక్కడి నుంచి చంచల్‌గూడ మహిళా జైలుకు తరలించి, ప్రత్యేక బ్యారక్‌లో అఘోరీని పెట్టారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శుక్రవారం,
25.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com






# ముష్కరులను కఠినంగా శిక్షించాలి

**తొర్రూరు, విశాలభారతి:**

కాశ్మీర్ లోయ ప్రాంతమైన మరో స్విట్జర్లాండ్ నుంచి తలపించే పర్యాటక ప్రాంతమైన ఫహల్ గామ్ ప్రాంతానికి విచ్చేసిన యాత్రికులపై పాకిస్తాన్ ముష్కరులు చేసిన దాడిని ఖండిస్తూ తొర్రూర్ పట్టణంలో ముస్లిం నాయకులు మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఎం.డి జలీల్, ముస్లిం మైనార్టీ నాయకుడు ఎండి అమీర్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలను చేతుల పట్టుకొని ర్యాలీని మస్జిద్ నుండి గాంధీ విగ్రహం మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు నిర్వహించి అనంతరం అమరవీరుల స్థూపం చౌరస్తాలో ముస్లిం నాయకులు సంయుక్తంగా మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులు హిందువులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని తమ ముక్తకర్ఠంతో ఖండిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం ఈ కవ్వింపు చర్యలకు పాల్పడిన పాకిస్తాన్ పై కఠిన చర్యలకు పూనుకోవాలని కోరుతున్నామని అన్నారు ప్రశాంతంగా ఉండే ప్రాంతాలలో ముష్కరులు వివిధ ప్రాంతాల్లో దాడులకు పాల్పడటం ఎంతో విచారకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో జామ మసీదు సదర్ కమిటీ అధ్యక్షుడు అలీమ్,కార్యదర్శి ఎండి మౌలానా, కోశధికారి యూసఫ్, ముస్లిం మత పెద్దలు యాకూబ్ పాషా, సయ్యద్, గుంశావళి, గఫార్, మహమూద్,బాబా, జఫిరుద్దీన్,ఖలీల్,బషీర్, ఇస్లాం,రషీద్, రియాజ్, కరీం,గౌస్ పాషా, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.



# భుభారతి రెవెన్యూ సదస్సు

**మద్దూర్, విశాలభారతి:**

భూభారతి పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయబడ్డ మద్దూరు మున్సిపాలిటీ కేంద్రంలో గురువారం భూభారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ప్రజలు ఈ సదస్సును వినియోగించుకొని తమ భూములకు సంబంధించిన ఎలాంటి అనుమానాలు, ఏదైనా తప్పులు జరిగి ఉన్న దరఖాస్తు చేసుకున్నారు వీలైనంత వేగంగా పరిష్కారం అందించే దిశగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అడిషనల్ కలెక్టర్ బెన్షాలం వెల్లడించారు. దాదాపుగా వందకు పైగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సీఎం నియోజకవర్గం కావడంతో అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలి అని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు.



# ఆగయ్య భౌతిక దేహాన్ని సందర్శించిన మాజీ మంత్రి

- **మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**దేవరుప్పల, విశాలభారతి:**

మండలం,రాంభోజీగూడెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ మామ ఆగయ్య మరణించిన విషయం తెలుసుకొని ఈ రోజు వారి ఇంటికి వెళ్ళి వారి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాం రెడ్డి,మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్,మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేశ్,మాజీ ఎంపిపి కొల్లూరి సోమయ్య,యూత్ అధ్యక్షుడు నవీన్ నాయక్,మండల, గ్రామ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# అమాయక ప్రజల ప్రాణాలు తీయడం పిరికిపందల చర్య

- **నాన్ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం హుస్సేనీ**

**హైదరాబాద్, విశాలభారతి:**

పహల్గామ్ జిల్లాలో అమాయక ప్రజలపైన తీవ్రవాదులు దాడి చేసి 28 ప్రాణాలను బలిగొన్న ఘటనను నిరసిస్తూ, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం, హైదరాబాద్ జిల్లా కార్యాలయములో మృతులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం హుస్సేనీ ముఖ్య అతిధిగా వచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ ఆయుధాలు లేని అమాయక ప్రజల ప్రాణాలు తీయడమన్నది పిరికిపందల చర్య అని, ఈ హింసాకాండ చేసిన ముష్కరులను ఎట్టి పరిస్థితులలో వదలకూడదని వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమములో జిల్లా సభ్యులు శ్రీమతి గీత రాణి, ఖాలెద్ అహ్మద్, ముఖీమ్ ఖురేషి, శ్రీధర్ వివిధ యూనిట్ల నుంచి శ్రీమతి శ్రీదేవి, సాహితీ, శ్రీ రాజు, సత్యనారాయణ, ఖలీమ్, సుధేర్షన్ గౌడ్, వర ప్రసాద్ మహేందర్, శ్రీనివాస్, మురహరి రోగేష్ పాల్గొన్నారు.

## గోశాలకు గ్రాసం పంపిణీ

**గరిడేపల్లి, విశాలభారతి:**

మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలోని గోశాలకు గ్రాసం పంపిణీ చేశారు. పొనుగోడు గ్రామానికి చెందిన సజ్జల రామచంద్రారెడ్డి ఒక ట్రాక్టర్ గడ్డిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సజ్జల ఆదిరెడ్డి, సజ్జల నాగిరెడ్డి, గాలి శ్రీనివాసరెడ్డి, ఏడిపాల ఉపేందర్ రెడ్డి, బత్తిని మహేష్ గౌడ్ చందా శ్రీనివాసరెడ్డి సజ్జల ఏ మంత్ రెడ్డి శ్రీను ఉన్నారు.



# డాక్టర్ సాగి...రికార్డుల మోతమోగి

- **నాలుగు పర్యాయాలు గిన్నిస్ బుక్‌లో**
- **డాక్టర్ సాగి సత్యనారాయణ పేరు నమోదు**
- **111 డాక్టరేట్లను సాధించిన ఏకైక డాక్టర్**
- **ఆస్కార్ ఇన్ ఎక్సలెన్సీ అవార్డు దక్కించుకున్న**
- **అరుదైన ఘనత ఆయన సొంతం**
- **ప్రతిభకు ప్రపంచవ్యాప్త గుర్తింపు**



Guinness World Record Certificate Is Awarded to Dr Sagi Satyanarayana On 9th October 2019.



**విశాలభారతి,హైదరాబాద్:**

ప్రతిభావంతుడికి గుర్తింపు అనేది ఓ ఆభరణం. ప్రతిభ అనేది పూర్వజన్మ సుకృతం. ఒక్క జన్మ కాదు అనేకానేక జన్మల పుణ్యఫలం. అందరకీ అటువంటి యోగం లభించదు.అటువంటి యోగులు, ప్రతిభావంతులు అత్యంత అరుదుగా ఉంటారు. సికింద్రాబాద్ మల్కాజ్గిరి లోని ఆనంద్ నగర్ నివాసి డాక్టర్ సాగి సత్యనారాయణ కలియుగ వాల్మీకి. పుస్తకాలు కాదు...అనేక గ్రంథాలు రచించారు. అందువల్లనే ఆయన కలియుగ వాల్మీకి. డాక్టర్ సాగి సత్యనారాయణ అత్యంత తక్కువ వ్యవధిలో అత్యధిక గ్రంథాలను రచించారు. వృత్తిరీత్యా వైద్యుడిగా సేవలందిస్తూనే ఖాళీ సమయాన్ని గ్రంథ రచనకు కేటాయించారు. ఏడాది కాలంలో 72కుపైగా పుస్తకాలను రచించారు. యోగాభ్యాసాలు, ధ్యానం, మెడికల్ సైన్సెస్,ఎమర్జెన్సీ మెడిసిన్, ఆదిత్య దర్శనం, శ్రీ సత్యసాయి భాగవతం, శ్రీ దత్తాత్రేయ గురుచరిత్ర, శివరహస్యాలు వంటి సామాజిక, ఆధ్యాత్మిక గ్రంథాలు కూడా ఉన్నాయి. పదేళ్ల కాలంలో మొత్తం 180 గ్రంథాలను రచించారు. ఈ నేపథ్యమే ఆయనకు రాష్ట్రీయస్థాయినుంచి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకొచ్చింది. స్వల్ప వ్యవధిలో అసాధారణరీతిలో గ్రంథ రచన, ప్రచురణ చేసినందుకుగాను మొత్తం నాలుగు గిన్నిస్ రికార్డులు దక్కాయి. తొలి గిన్నిస్ రికార్డును 2016 జనవరి 28న అందుకోగా, రెండోది అదే ఏడాది ఆగస్టులో వచ్చింది. మూడో గిన్నిస్ రికార్డును 2019 అక్టోబర్ 3వ తేదీన దక్కించుకున్నారు. 2022 ఆగస్టు 22న నాలుగోసారి గిన్నిస్ వరల్డ్ రికార్డులో డాక్టర్ సాగి పేరు నమోదయ్యింది. భారత ప్రతిభారత్న అంటూ ఆస్కార్ సంస్థ డాక్టర్ సత్యనారాయణపై ప్రశంసల జల్లు కురిపించింది. వివిధ అంశాలపై ఆయన రాసిన పుస్తకాల పేర్లను ప్రస్తావిస్తూ 2020. డిసెంబర్ 25న ఆస్ట్రేలియాలో జరిగిన కార్యక్రమంలో ఆస్కార్ ఇన్ ఎక్సలెన్సీ పురస్కారాన్ని ప్రకటించి అందజేసింది. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాలనుంచి అత్యధికంగా 111 డాక్టరేట్లను సాధించి అందరినీ అబ్బురపరిచారు....డాక్టర్ సాగి సత్యనారాయణ. ప్రపంచంలోనే అత్యధిక డాక్టరేట్లను సాధించిన గొప్ప వ్యక్తిగా నిలిచారు.ఇందులో ,డాక్టర్ ఆఫ్ సైన్స్ 15 .. డాక్టర్ ఆఫ్ లిటరేచర్లు 25తోపాటు 71 డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ ఉండడం విశేషం. ఇదంతా కేవలం 41 ఏళ్ల వ్యవధిలోనే సాధించారు. డాక్టర్ సాగి సత్యనారాయణ ప్రతిభాపాఠవాలకు గుర్తింపు లభిస్తూనే ఉంది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ కేంద్రంగా పనిచేస్తున్న మా భువనేశ్వరి విశ్వవిద్యాలయం...ఈ డాక్టర్‌గారికి మరో డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది. అలాగే తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేదిక్ విశ్వవిద్యాలయం ఇంకో డాక్టరేట్ అందజేశాయి. ఇక గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న వేదిక్ హిందూ విశ్వవిద్యాలయం ఇంకో డాక్టరేట్‌ను అందజేయడమే కాకుండా వైస్ చాన్సలర్ గా కూడా నియమించింది. తాజాగా ఈ డాక్టర్ పేరు లండన్ బుక్ ఆఫ్ రికార్డ్సులోనూ నమోదయ్యింది.



# మాదిగల విస్తృత స్థాయి సదస్సును విజయవంతం చేయండి

**విశాలభారతి, హైదరాబాద్:**

మాదిగల విస్తృత స్థాయి సదస్సును విజయవంతం చేయండని విద్యార్థి, యువజన నాయకులు అన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఆర్ట్స్ కాలేజ్ న్యూస్ సెమినార్ హాల్లో జరగబోయే మాదిగల ఎస్సీ వర్గీకరణ అమలు, మాదిగ మాదిగ ఉప కులాల అభివృద్ధి, సంక్షేమం మరియు ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ మాదిగల వాట విస్తృత స్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఆర్ట్స్ కాలేజ్ ముందు పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా ఆర్ట్స్ కాలేజ్ ఫిలాసఫి డిపార్ట్మెంట్ హెడ్ ప్రొఫెసర్ చెరుకుపల్లి వంశీధర్ , విద్యార్థి, యువజన నాయకులు డాక్టర్ మేడి రమణ, డాక్టర్ నంద్రు నరసింహారావు, గాదే వెంకట్ డాక్టర్ వెంకట్ కల్ల వెంకటేష్, దర్శనం జాన్, డాక్టర్ దూడపాక సురేష్, గోపాల్ దాస్ హరినాథ్, కొమ్ము అంబేద్కర్, శివ ప్రసాద్, బొల్లంపల్లి నరేష్, బి గౌతమ్, వి విజయ్ తదితర విద్యార్థి, యువజన నాయకులు పాల్గొన్నారు

# మోదీ.. సమరశంఖం పూరించు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

పహల్గాం దాడికి ప్రతీకారంగా అనుసరించాల్సిన వ్యూహంపై దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన అఖిలపక్షం భేటీ ముగిసింది. రెండు గంటలపాటు కొనసాగిన ఈ భేటీలో ఉగ్రదాడి ఘటనను అఖిలపక్షానికి వివరించారు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్‌సింగ్. ప్రభుత్వ చర్యలకు మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా లోక్ సభలో ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్ గాంధీ చెప్పారు. కాశ్మీర్‌లో శాంతి నెలకొనాలని రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు. ఈ ఉగ్రదాడిని అఖిలపక్షం తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం చేసింది.పహల్గామ్ ఉగ్రవాద దాడిపై కేంద్రం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న తర్వాత, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షం ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఇస్తుందని అన్నారు. "పహల్గామ్ ఉగ్రవాద దాడిని అందరూ ఖండించారు. ఏదైనా చర్య తీసుకోవడానికి ప్రతిపక్షం ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఇచ్చింది" అని రాహుల్ సమావేశం తర్వాత మీడియాతో అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ, అన్ని పార్టీలు ఈ దారుణమైన దాడిని ఖండించాయని, జమ్మూ కాశ్మీర్‌లో శాంతిని కాపాడటానికి కృషి చేయాలని అన్నారు. "అన్ని పార్టీలు దాడిని ఖండించాయి. జమ్మూ కాశ్మీర్‌లో శాంతిని కాపాడటానికి ప్రయత్నాలు జరగాలని మేము చెప్పాము" అని ఖర్గే అన్నారు.

**అఖిలపక్షం నివాళులు**

రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్షం భేటీకి హోంమంత్రి అమిత్ షా, విదేశాంగమంత్రి జైశంకర్, కేంద్రమంత్రులు జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్, కిరణ్ రిజుజు హాజరయ్యారు. వీరితోపాటు ఖర్గే, రాహుల్, శ్రీకృష్ణదేవరాయలు, అసదుద్దీన్ ఒవైసీ సహా వివిధ పార్టీల ఫ్లోర్ లీడర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో మరణించిన 26 మందికి అఖిలపక్షం నివాళులు అర్పించింది. ఇలా ఉండగా, నేడు జమ్మూకశ్మీర్‌లో రాహుల్‌గాంధీ పర్యటించబోతున్నారు.


# పెహల్గామ్ ఉగ్రదాడి పిరికిపంద చర్య

**తరువాయి భాగం**

చేసింది. ఆ ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఉగ్రదాడి హేయమైన చర్యగా అభివర్ణించింది. ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు సంతాపం చెబుతున్నట్లు సీడబ్ల్యూసీ పేర్కొన్నది. ఉగ్రదాడి ఓ పిరికిపంద చర్య అని, ఈ దాడికి సూత్రధారి పాకిస్థాన్ అని ఆ పార్టీ తన తీర్మానంలో పేర్కొన్నది. హిందువులను కావాలనే టార్గెట్ చేసి దేశవ్యాప్తంగా అల్లర్లు సృష్టించే ప్రయత్నం చేసినట్లు తీర్మానంలో ఆరోపించారు. రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించిన ఘటన ఇది అని, ఈ సమయంలో ప్రజలు శాంతియుతంగా ఉండాలని ఆశిస్తున్నట్లు పార్టీ చెప్పింది. సీమాంతర ఉగ్రవాదాన్ని యుక్తితో ఐక్యంగా ఎదుర్కోవాలని తీర్మానంలో పేర్కొన్నారు.మీడియా సమావేశంలో పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్.. సీడబ్ల్యూసీ తీర్మానాన్ని చదివి వినిపించారు. సీనియర్ నేతలు జైరాం రమేశ్, పవన్ ఖేరా కూడా ఆ మీటింగ్‌లో పాల్గొన్నారు. పర్యాటకుల్ని కాపాడే ప్రయత్నంలో స్థానిక పోనీవాలా ప్రాణాలు కోల్పోయాడు. అతనికి సీడబ్ల్యూసీ నివాళి అర్పించింది. అన్ని వర్గాల ప్రజలు, పార్టీలు.. పెహల్గామ్ దాడిని ఖండించాయని తీర్మానంలో గుర్తు చేశారు. ప్రస్తుత విషాద పరిస్థితి బీజేపీ విద్వేషానికి వాడుకుంటోందని కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. సెక్యూర్టీ, ఇంటెలిజెన్స్ వైఫలం గురించి చెప్పాలని కాంగ్రెస్ నేత ప్రశ్నించారు.ఉగ్రదాడిని ఖండిస్తూ ఏప్రిల్ 25వ తేదీన దేశవ్యాప్తంగా క్యాండిల్ ర్యాలీ ఉంటుందని వేణుగోపాల్ తెలిపారు. పెహల్గాం ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు చనిపోయిన విషయం తెలిసిందే.

# కుమురం భీం జిల్లాలో ఒకే మండపంలో ఇద్దరు యువతులను పెళ్లాడిన వరుడు

- **కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఘటన**
- **ఇరువురు అమ్మాయిల కుటుంబాల అంగీకారంతో వివాహం**



**విశాలభారతి, హైదరాబాద్:**

ఆదివాసీ సంప్రదాయంలో వైభవంగా పెళ్లి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఒక వింతైన వివాహం చోటు చేసుకుంది. ఒక యువకుడు ఒకే వేదికపై ఇద్దరు యువతులను ఏకకాలంలో పెళ్లాడటం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే, జైనూర్ మండలం అడ్డెసర గ్రామానికి చెందిన రంభ బాయ్, బద్రుషావ్ దంపతుల కుమారుడు ఛత్రుషవ్, అదే గ్రామంలోని పూనగూడకు చెందిన జంగుబాయిని, ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం సాంగ్వి గ్రామానికి చెందిన సోమ్‌దేవిని ఒకే ముహూర్తానికి, ఒకే మండపంలో వివాహం చేసుకున్నాడు. ఈ వివాహానికి ఇద్దరు అమ్మాయిల కుటుంబ సభ్యులు సమ్మతి తెలిపారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం ఈ వివాహ వేడుకను ఘనంగా నిర్వహించారు. వరుడు ఛత్రుషవ్, ఇద్దరు వధువులు జంగుబాయి, సోమ్‌దేవితో కలిసి ఒకేసారి ఏడడుగులు నడిచాడు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శుక్రవారం,
25.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ఉగ్రవాదాన్ని కూకిటివేళ్ళతో సహా తీసెయ్యాలి



**మద్దూరు, విశాలభారతి:**
పహల్గాంలో జరిగిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాద నరమేధంలో అసువులు బాసిన భారతీయుల ఆత్మకు శాంతి చేకూరాలని పెదిరిపాడ్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు కొవ్వొత్తుల తో ర్యాలీ నిర్వహించారు.ఇందులో భాగంగా దేశ ప్రజలంతా అప్రమత్తంగా ఉండి ఐకమత్యంతో పోరాడాలి అని పిలుపునిచ్చారు. భరతమాత కి జై, పాకిస్తాన్ డౌన్ డౌన్ వంటి నినాదాలు చేసారు.ఈ ర్యాలీ లో మద్దూరు మున్సిపాలిటీ ప్రజలు, యువకులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మేడే వార్షికోత్సవంలో పెద్ద ఎత్తున కార్మిక వర్గం పాల్గొనాలి

- కామళ్ళ నవీన్ ఐఎఫ్ టియు జిల్లా అధ్యక్షులు




**సూర్యాపేట,విశాలభారతి:**
చికాగో కార్మిక పోరాట అమరవీరుల స్ఫూర్తి తో భారత కార్మిక వర్గం తమ హక్కులు, సౌకర్యాల కోసం, వేతనాల పెరుగుదల, కనీస జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని కార్మిక వర్గం బలమైన పోరాటాలను నిర్వహించాలని ఐఎఫ్ టియు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కామళ్ళ నవీన్, ఘంట నాగయ్యలు పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో స్థానిక చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రం నందు భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్ టి యు) సూర్యాపేట జిల్లా కమిటీ సమావేశం జరిగింది. అనంతరం మే డే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గం మెరుగైన సౌకర్యాల కోసం పని దినాల, గంటల తగ్గింపు కోసం కార్మిక వర్గం పోరాటాలు చేస్తుంటే మరోపక్క మోడీ ప్రభుత్వం కార్పోరేట్, పెట్టుబడుదారులకు ఊడిగం చేస్తూ కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ, కార్మిక హక్కులను హరించి వేస్తున్నారని దుయ్యబట్టారు. కార్పొరేట్ సంస్థలైన ఇన్ఫోసిస్, ఎల్ అండ్ టి, జిందాల్, ఆదాని, అంబానీ సంస్థలు లాంటి వారు కార్మికుల శ్రమను దోచుకోవడానికి రోజుకు 12 లేదా 13 గంటలు పనిచేయాలని, చేయించాలని ప్రభుత్వాలపై ఒత్తిడి చేయడం ను తీవ్రంగా వ్యతిరేకించారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లాగా చేసి, ఆధునిక టెక్నాలజీ ఏఐ తో కార్మిక వర్గానికి ఉరి తాళ్లుగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకరణ చేస్తూ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానాన్ని పెంచి పోషిస్తూ, కనీస వేతనాలను అమలు చేయకుండా, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయకుండా, కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. ప్రతి కార్మికుడి కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు ఇవ్వాలని, హమాలి, ఆటో డ్రైవర్లకు, గిగ్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. దేశానికి స్వతంత్రం వచ్చి 75 ఏళ్లు దాటిన పర్మనెంట్ ఉద్యోగం కోసం, ఉద్యోగ భద్రత కోసం పోరాటాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని చెప్పి, స్మార్ట్ సిటీ,డిజిటల్ ఇండియా, జన్ ధన్ యోజన, మేకిన్ ఇన్ ఇండియా లాంటి కొత్త కొత్త పేర్లు చెప్పి ఒక్కొక్క ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అమ్మేస్తున్నారని ధ్వజమెత్తారు. అడవుల నుండి ఆదివాసీ,గిరిజనులను గెంటివేస్తూ అటవీ సంపదను విదేశీ, స్వదేశీ బహుళ జాతి కంపెనీలకు కట్టబెట్టుటకు తీవ్ర ప్రయత్నాలు మోడీ, అమిత్ షాలు కొనసాగిస్తూ అర్బన్ నక్సలైట్లు పేరుతో ఆదివాసి గిరిజనులను కాల్చి చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో బిజెపి ప్రభుత్వం పాలన కొనసాగించడం లేదని, ఆర్ఎస్ఎస్ కనుసన్నలలో కార్పొరేట్ల ప్రభుత్వమే పాలన కొనసాగిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, జిల్లా కమిటీ సభ్యులు సామ నర్సిరెడ్డి, నాగేల్లి రామ నరసయ్య, మూరగుండ్ల మధు, హమాలీ యూనియన్ నాయకులు పురుషోత్తం, చంద్రశేఖర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## అధికారుల క్షేత్ర స్థాయి పరిశీలన

**బాల్కొండ,విశాలభారతి**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత కొరకు ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకంపై క్షేత్ర స్థాయిలో ఎంక్వయిరీ ప్రారంభం అయ్యింది. భీంగల్ పట్టణంలో ఈ పథకానికి 575 మంది యువతి,యువకులు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. పథకానికి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులు ఎంతమంది, అనర్హులు ఎంతమందో గుర్తించాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశాలు జారీ చేయడం జరిగింది.ఈ మేరకు మున్సిపల్ కమీషనర్ గోపు గంగాధర్ ఆధ్వర్యంలో వార్డ్ అధికారులు పట్టణంలో దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్లలోకి వెళ్లి పరిశీలన చేశారు.క్షేత్ర స్థాయికి వెళ్లిన అధికారులు పథకానికి అర్హత ఉందా లేదా అనేది క్షుణ్ణంగా పరిశీలన జరిపి నివేదిక తయారు చేస్తున్నారు.పథకానికి నిజమైన అర్హులను గుర్తించేందుకు ఈ క్షేత్ర స్థాయి పరిశీలన అధికారులతో చేయడం జరుగుతుందని కమీషనర్ తెలిపారు. సర్వేలో మేనేజర్ నరేందర్,వార్డ్ అధికారులు ఉన్నారు.



## గ్రామానికి అవసరాల ఆధారిత ప్రణాళికలను రూపొందించడానికి గ్రామ సభను ఉపయోగిస్తారు

- తహసిల్దార్ దూలం మంజుల.

**సైదాపూర్ విశాలభారతి:**
మండలంలోని బొమ్మకల్ గ్రామంలో ప్రత్యేక అధికారి తాహసిల్దార్ దూలం మంజుల గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీరాజ్,గ్రామాభివృద్ధికి మూలస్తంభం. ప్రజలు స్థానిక పాలన,అభివృద్ధి గురించి చర్చించడానికి, గ్రామానికి అవసరాల ఆధారిత ప్రణాళికలను రూపొందించడానికి గ్రామసభ వేదికను ఉపయోగిస్తారాన్నారు.గ్రామసభ యొక్క సమగ్ర ఆదేశం, పర్యవేక్షణ,పర్యవేక్షణ కింద పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుంది. పంచాయతీ యొక్క అన్ని నిర్ణయాలు గ్రామసభ ద్వారా తీసుకోబడతాయన్నారు.గ్రామసభ అనుమతి లేకుండా ఏ నిర్ణయం అధికారికమైనది చెల్లదన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ గౌడ్,అనిల్ గౌడ్,పవన్,సారయ్య,శ్రీనివాస్, సుదీర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు




## భూ భారతి చట్టం ద్వారా రైతులకు మేలు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**మునుగోడు, విశాలభారతి:**
ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం ద్వారా రైతులకు మేలు కలుగుతుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మనీ గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన భూభారతి చట్టం 2025 చట్టం పైన అవగాహన సదస్సు కార్యక్రమానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కలిసి హాజరయ్యారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిందన్నారు నల్లగొండ ప్రాంతంలో భూముల కోసం పోరాటం చేసిన సంఘటనలు ఉన్నాయని, భూదాన్ భూములు, దేవాదాయ భూములు, అసైన్డ్ భూములు, అన్ని రకాల భూములు నల్గొండలో ఉన్నాయని, భూములు ఎక్కువగా ఉన్నచోట సమస్యలు కూడా ఎక్కువగా ఉంటాయని, అయితే భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మునుగోడు ప్రాంతం ఫ్లోరైడ్ పీడిత ప్రాంతంగా ఉన్నందున వాగులే ఆధారంగా ఉన్నాయని, అయితే ఈ మధ్య కాలంలో వాగులు సైతం ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని సంరక్షించే చర్యలు చేపట్టాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. అలాగే మునుగోడు అత్యంత వెనుకబడిన ప్రాంతమని, ప్రాజెక్టులను తీసుకొచ్చి పూర్తిచేయాల్సిన అవసరం ఉందని, ఇందిరమ్మ ఇండ్లతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో మునుగోడు ప్రాంతానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డి సి సి బి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి చండూర్ ఆర్టీవో శ్రీదేవి మునుగోడు తాసిల్దార్ నరేందర్ ఎంపీడీవో శాంతి కుమారి డిప్యూటీ తాసిల్దార్ నరేష్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన పెద్ది కృష్ణమూర్తి

**దేవరుప్పల, విశాలభారతి:**
మండల సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త చింత ఎల్లయ్యరేణుక దంపతుల ద్వితీయ కుమార్తె స్పందనప్రభుదాస్ ల వివాహం కొడకండ్ల మండలం,లక్ష్మక్క పల్లి గ్రామంలో జరుగగా ఆ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన దేవరుప్పుల పిఏసిఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల సాయి ప్రకాష్,దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు చింత మల్లయ్య,చింత సోమయ్య, తోటకూరి మహేష్,పత్తేపురపు శేఖర్,ఆకుల సంతోష్, కారుపోతుల సురేష్,చింత ఉప్పలయ్య,చింత ప్రవీణ్,చింత కిరణ్,జోగు శోభన్ బాబు,తదితరులు పాల్గొన్నారు.



## సభా ప్రాంగణాన్ని పరిశీలించిన నాగూర్ల వెంకన్న

**విశాలభారతి, ఎల్కతుర్తి:**
ఎల్కాతుర్తిలో జరుగుతున్నటువంటి రజితోత్సవ సభకు విచ్చేసిన నాగూర్ల వెంకన్న సభా ప్రాంగణాన్ని పరిశీలించి వచ్చే కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలని నాగూర్ల వెంకన్న సూచనలు అందించారు పార్కింగ్ ప్లేస్ లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ముఖ్య కార్యకర్తలకు సూచనలు అందించారు ఈ కార్యక్రమాన్ని 100% పూర్తి చేయాలని ప్రజల యొక్క నమ్మకాన్ని అభియోగించి ప్రతి ఒక్కరికి టిఆర్ఎస్ పార్టీ చేసిన మంచి పనులను ప్రతి ఒక్కరూ గుర్తించేలా చూడాలని వచ్చిన కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు ఇందులో పాల్గొన్నవారు నాగూర్ల వెంకన్న గ్యాదరి బాలమల్లు రాష్ట్ర కార్యదర్శి మండల అధ్యక్షులు పిట్టల మహేందర్ ఎంపిటిసి పోరం అధ్యక్షులు కదారి రాజు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు



## ఇందిరమ్మ క్రాంతి పథకం కేంద్రాలను సందర్శించిన ఏపిఎం

- మండల అధికారి ఏపిఎం మధుసూదన్

**తిరుమలగిరి, విశాలభారతి:**
తిరుమలగిరి మండల పరిధిలో మర్రి కుంట తండా గ్రామంతో పాటు వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ క్రాంతి పథకం ద్వారా కొనుగోలు కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల అధికారి ఏ పి ఎం ఎం మధుసూదన్ సందర్శించి కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని పర్యవేక్షించి, కొనుగోళ్ల రిజిస్టర్ లను సక్రమంగా నిర్వహించాలని, రైతుల పూర్తి వివరాలను రికార్డుల్లో స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. కొనుగోళ్లు పూర్తైన వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని, ఎప్పటికప్పుడు ఓ పీ ఎం ఎస్ లో కొనుగోళ్ల వివరాలను నమోదు చేయాలని, తద్వారా సకాలంలో రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతుందని సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు గింజలు లేకుండా తేమశాతం వచ్చే విధంగా ఆరబోయాలని ఆయన చెప్పారు. ఐకెపి నిర్వాహకులు రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన కోరారు. రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఐకెపి కేంద్ర నిర్వాహకులను సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ పరిశీలనలో సి సి ఆర్ విజయ లక్ష్మి, సియాఫ్ బానోతు లక్ష్మణ్ నాయక్, సిబ్బందిలు ఇందిరమ్మ క్రాంతి పథకం కొనుగోలు నిర్వహ కమిటీ మెంబర్లు,బానోతు భాస్కర్ నాయక్, శ్రీను నాయక్, అచ్చాలి, రైతులు బానోతు లచ్చిరాం, నాయక్, బోడియా, బాలాజీ, దేవా, వాలియా పాల్గొన్నారు.



## టిడిపి సభ్యత్వ కార్డులు పంపిణీ

**మణుగూరు, విశాలభారతి:**
తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ కార్డులు అందజేత కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ కొండపల్లి రామచంద్రరావు పాల్గొని తెదేపా నాయకులకు బూతుల వారిగా నియోజకవర్గంలో గల నాయకులకు కార్యకర్తలకు పంపిణీ చేశారు.ఈసందర్భంగా అయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గంలో రికార్డ్ స్థాయిలో సభ్యత్వాలు నమోదు చేపట్టడం జరిగిందని, ప్రజలు చంద్రబాబు నాయుడు నాయకత్వంపై విశ్వాసం ఉంచి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవడం అభినంద నీయమని తెలిపారు. సభ్యత్వం తీసుకున్న తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరికీ పేరుపేరునా తెలుగుదేశం పార్టీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల,పట్టణ, గ్రామ, వార్డు స్థాయిలో గల నాయకులందరూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీని పండుగ వాతావరణంలో ప్రతి ఒక్కరికి పంపిణీ చేయాలని ఆయన కోరారు. పార్టీ సభ్యత నమోదు తీసుకున్న ప్రతి ఒక్కరికి 5 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంటుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నియోకవర్గ నేత వట్టం నారాయణ దొర మండల నాయకులు మల్లిడి లోకేష్, ఉప్పలపాటి రాంబాబు,రాజా,ముమ్మినేని సత్యనారాయణ, పూర్ణ , జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, బచ్చల సుమేష్ పొగాకు వెంకటేశ్వర్లు, మల్లయ్య, మహిళా నేతలు కమూరనిషా బేగం, విజయ లక్ష్మి పాల్గొన్నారు.



## అంగన్వాడి కేంద్రాలలో ప్రీ స్కూల్ డే

**దేవరుప్పల, విశాలభారతి:**
గ్రామపంచాయతీ పరిధిలో అంగన్వాడీ కేంద్రాలు అన్ని కలిసి గ్రామస్థాయిలో పోషణ పక్షం ప్రీ స్కూల్ డే, నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిడిపిఓ సత్యవతి సూపర్వైజర్ సావిత్రి హాజరై మాట్లాడుతూ తల్లులకు తీసుకోవలసిన జాగ్రత్తలు వెయ్యి రోజుల ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగింది. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలు ప్రీస్కూల్ అంగన్వాడి కేంద్రానికి, పంపించడం ద్వారా పిల్లలకు ఆట, పాటలు, కాకుండా, విద్య నేర్పించడం జరుగుతుంది. పిల్లలకు అన్ని రకాల అభివృద్ధి, చెందుతారు. అని అన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు అన్నప్రసన్న, గ్రాడ్యుయేషన్ డే, బర్తడేలు, శ్రీమంతాలు, నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ మధుకర్, కారోబార్ ఎడవెల్లి వెంకట్ రెడ్డి, ఏఎన్ఎం వసంత, అంగన్వాడి ఉపాధ్యాయులు, ఆశాలు, పిల్లలు, తల్లులు, గర్భిణీలు, తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
25.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


vishalabharathi Telugu Daily

## పహల్గాం మృతులకు సంతాపం

**బాల్కొండ,విశాలభారతి:**
జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో పాకిస్తాన్ తీవ్రవాదులు జరిపిన కాల్పులలో మృతి చెందిన వారికి సంతాపంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, పోచంపాడ్ డివిజన్ సర్కిల్ కార్యాలయం ఉద్యోగులు గురువారం కార్యాలయ ఆవరణలో ర్యాలీ నిర్వహించి మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని 2 నిమిషాల పాటు మౌనం పాటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకొని జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో ఉగ్రవాదాన్ని ఉక్కు పాదంతో అణచి వేయాలని కోరారు.ఇలాంటి అనాగరిక చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ టీఎన్జిఓ యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# GENERAL NEWS



# అమృత ఫుడ్ కోర్ట్ ప్రారంభం

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

**పెద్ద అంబర్ పేట్,విశాలభారతి:**
హయత్ నగర్ డివిజన్ లోని రాజప్ప నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన అమృత ఫుడ్ కోర్ట్ ప్రారంభోత్సవంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్,స్థానిక హయత్ నగర్, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహా రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ఫుడ్ కోర్ట్ ప్రారంభించారు.ఈ యొక్క కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా(అర్బన్) మాజీ అధ్యక్షులు సామ రంగారెడ్డి , అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ మల్కాజిగిరి పార్లిమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్ , డివిజన్ బీజేపీ అధ్యక్షులు గంగాని శ్రీను , అధ్యక్షురాలు పర్వత ,ప్రధాన కార్యదర్శిలు సంఘీ అశోక్ గారు, గోవింద చారి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# అర్చక ఉద్యోగ జేఏసీ డైరీ ఆవిష్కరణ

**విశాలభారతి,భీమదేవరపల్లి :**
కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి సన్నిధిలో తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ డైరీ ఆవిష్కరణ తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అర్చక ఉద్యోగుల సమస్యలపై సమావేశంలో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాశ్మీర్లో హిందువులపై ఉగ్రదాడి పైశాచికత్వంపై తమ దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ, గంగు ఉపేందర్ శర్మ , కొత్తకొండ దేవాలయ అర్చకులు, సిబ్బంది అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అంతకుముందు ఉపేందర్ శర్మకు సన్మానం చేసి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి వేద మంత్రాలతో అర్చకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఉప ప్రధాన అర్చకులు రాజయ్య, ముఖ్య అర్చకులు రాంబాబు, శ్రీకాంత్ శర్మ, అర్చకులు వినయ్ శర్మ, శివకుమార్, శరత్చంద్ర, సందీప్, శ్రవణ్, రవిశర్మ పాల్గొన్నారు.



# బోటనీలో డాక్టరేట్ పట్టా అందుకున్న శివకుమార్

- హర్షం వ్యక్తం చేసిన రత్నగిరి గ్రామస్తులు

**విశాలభారతి,భీమదేవరపల్లి :**
మండలంలోని రత్నగిరి గ్రామానికి చెందిన అంబీరు శివకుమార్ ఉస్మానియా యూనివర్సిటీ నుండి బొటనిలో పీహెచ్డీ పట్టా అందుకున్నారు. శివకుమార్ రాసిన థీసిస్ ఇన్విట్రో ప్రో పేగేషన్, ఫీటో కెమికల్ అండ్ మొలిక్యులర్ ఎనాలసిస్ ఆఫ్ జింజిబర్ జెరుంబెట్ అనే అంశంలో ఈ పట్టా అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ సూపర్వైజర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కరుణాకర్ రెడ్డి చేతుల డాక్టరేట్ అందుకున్నారు. మారుమూల గ్రామంలో జన్మించి స్వయంకృషితో, పట్టుదలతో పీహెచ్డీ సాధించడం పట్ల రత్నగిరి గ్రామస్తులు, తల్లిదండ్రులు కుమారస్వామి శారద ఆనందం వ్యక్తం చేశారు. శివకుమార్ డాక్టరేట్ పొందడం పట్ల ముల్కనూర్ విశ్వ శాంతి హై స్కూల్ డైరెక్టర్లు కాశిరెడ్డి ఆదిరెడ్డి, దస్తరి ఉమా మహేశ్వర్, సిహెచ్ గోపాల్ రెడ్డి వర్షం వ్యక్తం చేశారు.

# ఉగ్రవాదుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి



**సూర్యాపేట,విశాలభారతి:**
జమ్మూ కాశ్మీర్ లోని పహల్గం ప్రాంతంలో పర్యాటకులపై దాడి చేసి 27 మందిని చంపిన ఉగ్రవాదుల చర్యలను సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఈ దాడిని దేశ ప్రజానీకం ముక్తకంఠంతో ఖండించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జమ్ము కాశ్మీర్ లోని పహల్గాం పర్యాటక ప్రదేశాలను సందర్శించడానికి వెళ్లిన 27 మంది పర్యాటకులను విచక్షణరహితంగా దాడి చేసి తుపాకులతో కాల్చి చంపిన ఉగ్రవాదుల చర్యలను దేశ ప్రజానీకం ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఇది పిరికిపందల చర్యగా అభివర్ణించారు.ఈ దాడిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉందని మరి కొంత మందికి తీవ్ర గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు భిన్నత్వంలో ఏకత్వం కలిగి వసుదైక కుటుంబ భావన కలిగిన భారత దేశంలో ఇటువంటి విద్వేష విభజన రాజకీయాలను దేశం ఏనాటికి అంగీకరించదని అన్నారు పరస్పర సహకారం సహనంతో ప్రపంచ అభివృద్ధి జరుగుతుందే తప్ప ప్రజల ఆచారాలు సాంప్రదాయాలు ఆహార అలవాట్లపై ద్వేషం పెంచుకోవడం వల్ల ఒనగూరేది ఏమీ లేదని అన్నారు. పర్యాటకుల పై జరిగిన ఉన్మాద చర్యలకు వ్యతిరేకంగా బాధిత కుటుంబాలకు అండగా దేశ ప్రజానీకం నిలబడాలని కోరారు.





# భూ భారతితో నిర్ణీత గడువులోపు భూ సమస్యలు పరిష్కారం

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- పహల్గామ్ మృతులకు నివాళులు అర్పించిన సదస్సు

**బాల్కొండ,విశాలభారతి:**
నిర్ణీత గడువులోపు భూ సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం దోహదపడుతుందని నిజమాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు.భూమి హక్కుల రికార్డులలో ఏవైనా లోటుపాట్లు, తప్పులు ఉంటే వాటిని సవరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ నూతన ఆర్.ఓ.ఆర్ 2025 చట్టం వెసులుబాటు కల్పిస్తుందని అన్నారు. భీమ్‌గల్,వేల్పూర్ మండల కేంద్రాలలో భూభారతి చట్టంపై గురువారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు.ముందుగా జమ్మూ కాశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారికి ఈ సదస్సులో రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్,ఈ కొత్త చట్టం వల్ల రైతులకు,ప్రజలకు చేకూరే ప్రయోజనాలు,చట్టంలో పొందుపర్చిన కీలక అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ధరణి రికార్డులను భూభారతిలో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎవరికైనా భూముల రికార్డుల విషయంలో తప్పులు ఉంటే,ఈ చట్టం అమలులోకి వచ్చిన ఏడాది కాలంలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారులు గ్రామాలకు వచ్చి అర్జీలు స్వీకరిస్తారని అన్నారు.ఈ అర్జీలను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా తప్పులను సవరిస్తారని,ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు.మొదటి అంచెలో ఆర్డీఓ అప్పీలును పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటారని,అయినా సంతృప్తి చెందకపోతే కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని,ల్యాండ్ ట్రిబ్యునల్ ను కూడా అప్పీలు చేసుకునేందుకు భూభారతి చట్టం అవకాశం కల్పిస్తుందని వివరించారు.అప్పీలు చేసుకున్న సన్న చిన్నకారు,పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారని అన్నారు.రైతులు భూ సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, నిర్దిష్టకాల వ్యవధిలో వాటిని పరిష్కరించి,రైతుల భూములపై వారికి హక్కులు ఏర్పరుస్తూ, వారికి పూర్తి భరోసా కల్పించడం జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా పట్టా పాస్ బుక్కులలో సమగ్ర వివరాలతో,హద్దులను పేర్కొంటూ భూమి పటం (మ్యాప్) పొందుపరుస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్,మ్యుటేషన్ చేయడానికి ముందు సర్వే మ్యాప్ రూపొందించి పట్టా పాస్ బుక్కుకు జత పరుస్తారని అన్నారు. ఆధార్ తరహాలోనే భూముల వివరాలతో కూడిన భూధార్ నెంబర్ కేటాయిస్తారని తెలిపారు.ఈ చట్టంలో ఇంటి స్థలాలకు,ఆబాది, వ్యవసాయేతర భూములకు కూడా హక్కుల రికార్డు ఉంటుందన్నారు.ఎవరైనా మోసపూరితంగా హక్కుల రికార్డులు తారుమారు చేసి ప్రభుత్వ,భూదాన్,అసైన్డ్, దేవాదాయ,వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే అలాంటి పట్టాలను రద్దు చేసే అధికారం భూభారతి ద్వారా అధికారులకు కల్పించారని వివరించారు. ధరణి లో కొన్ని భూ సమస్యల పరిష్కారానికి అవకాశం ఉండేది కాదని,అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని గుర్తు చేశారు.ప్రస్తుతం తహసీల్దార్,ఆర్డీఓ లకు దరఖాస్తులు చేసుకుని సమస్యలు పరిష్కరించుకునేలా భూభారతి వెసులుబాటు కల్పిస్తుందని అన్నారు.సాదా బైనామా పెండింగ్ దరఖాస్తులను కోర్టు స్టే విధించడం వల్ల ధరణిలో పరిష్కరించేందుకు అవకాశం లేకపోయిందని, ప్రస్తుతం కొత్త ఆర్.ఓ.ఆర్ చట్టంలో పెండింగ్ దరఖాస్తులను ఆర్డీఓలు పరిశీలించి క్రమబద్ధీకరిస్తారని తెలిపారు. అర్హులైన రైతులు ఈ చట్టంపై అవగాహనను పెంపొందించుకుని, భూ సమస్యలు ఉంటే గ్రామ సభలలో అధికారులకు అర్జీలు అందించి పరిష్కరించుకోవాలని, ధరణి పోర్టల్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా రైతుల సందేహాలను నివృత్తి చేశారు.ఈ సదస్సులో డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి,ఆర్మూర్ ఆర్డీఓ రాజా గౌడ్,స్థానిక అధికారులు, మార్కెట్ కమిటీలు,సొసైటీల చైర్మన్లు,రైతులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్

**సూర్యాపేట,విశాలభారతి:**
జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మిశారద ను గురువారం కోర్టు సముదాయం నందు మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా ఎస్పీ నరసింహ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో నేరాల నమోదు, దర్యాప్తు, కోర్టు క్యాలండర్ నంబర్, కేసు ట్రైయల్స్, లోక్ అదాలత్ నిర్వహణ, కేసుల్లో నేరస్తులకు శిక్షల అమలు మొదలగు అంశాల గురించి చర్చించారు. కోర్టు అధికారులు, పోలీసులు సమన్వయంతో పని చేసి త్వరి



తగతిన కేసుల పరిష్కారం చూపాలని జడ్జి అన్నారు.

## మండలంలో కొనసాగుతున్న
# డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర

- ముల్కనూర్ లో నేడే ముగింపు సభ
- జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య

**విశాలభారతి, భీమదేవరపల్లి:**
గత నాలుగు రోజులుగా మండలంలోని మాణిక్యాపూర్ గ్రామంలో ప్రారంభమైన డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర మండలంలోని అన్ని గ్రామాలలో జేఏసీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రజలను చైతన్య పరిచారు. శుక్రవారం ముల్కనూర్ వెంకట సాయి గార్డెన్ లో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర ముగుస్తుందని కవ్వ లక్ష్మారెడ్డి తెలిపారు. మండల ప్రజలు ముగింపు సభకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేత కవ్వ లక్ష్మారెడ్డి, నియోజకవర్గం హుస్నాబాద్ కో.ఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్, అంబేద్కర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్, ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి మాట్ల వెంకటస్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు తాళ్లపల్లి ఆశీర్వాదం,ఎదులాపురం మొగిలి, డాక్టర్ తిరుపతి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు సుంచు ఐలయ్య పాల్గొన్నారు.





# పహల్గాం అమరులకు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే వేముల

**బాల్కొండ,విశాలభారతి**
బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ మండల కేంద్రంలో జమ్మూ కాశ్మీర్ పహల్గాం టెర్రరిస్ట్ అటాక్ లో అసువులు బాసిన అమరులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి పూలతో నివాళి అర్పించి మౌనం పాటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో తీవ్రవాదులు అమాయక యాత్రికులపై చేసిన దాడిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు.భారత దేశాన్ని ఎదుర్కొనే దమ్ములేక శత్రుదేశాలు చేస్తున్న ఒక పిరికిపందా,హేయమైన చర్య అని తెలిపారు. టెర్రరిస్ట్ అటాక్ లో అసువులు బాసిన అమరులకు బీఆర్ఎస్ పార్టీ పక్షాన నివాళులు, సంతాపం,ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఇంటలీజెన్స్ వైఫల్యం వల్లనే ముష్కరులు ఈ చర్యకు పాల్పడే సాహసం చేశారని అన్నారు. ఇటువంటి చర్యలు జరగటం బాధాకరం, మళ్ళీ ఇలాంటి దాడులు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేయడం,ఇంటలీజెన్స్ వ్యవస్థను బలోపేతం చేయడం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.భారత సైన్యం,భారత వ్యవస్థ గొప్ప జాతీయ వాదంతో ముందుకు వెళుతుందని అన్నారు.భారత సైన్యం,ప్రజల్లో,ఆత్మస్థైర్యం దెబ్బ తినకుండా దాడులు చేసిన ముష్కరుల పై చెంపపెట్టు లాంటి చర్యలు కేంద్రప్రభుత్వం తీసుకోవాలి అని పార్టీ డిమాండ్ చేస్తుందని తెలిపారు.దాడులు చేసిన వారిపై ప్రోత్సహించిన సంస్థలపై,శత్రు దేశాలకు భారతదేశ పక్షాన దీటైన జవాబు చెప్పాలని అన్నారు. భారత దేశ అస్థిత్వాన్ని దెబ్బతీసే వారిపై కేంద్ర ప్రభుత్వం తీసుకునే చర్యలకు, భారత సైన్యానికి యావత్ భారతదేశం పౌరులుగా ముక్త కంఠంతో మద్దతు తెలుపుతామని అన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
25.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




## ఎడ్యుకేషన్ ఫెయిర్ పోస్టర్‌ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

ఎల్బీనగర్ , విశాలభారతి:

తెలంగాణా విద్య సమితి ఆధ్వర్యంలో మే 1718 ఉప్పల్ శిల్పరామంలో నిర్వహిస్తున్న తెలంగాణా అతి పెద్ద ఎడ్యుకేషన్ ఫెయిర్ పోస్టర్ నీ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ చేయుటం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులకు యువతకు పై చదువుల కొరకు నిర్వహిస్తున్న అవగాహనా సదస్సు లో తెలంగాణాతో పాటు దేశంలోని ప్రముఖ యూనివర్సిటీలు పాల్గొంటారు. కనుక విద్యార్థులు తల్లిదండ్రులు ఈ అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలి అని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమములో తెలంగాణా విద్య సమితి అధ్యక్షులు పెండెం తారక్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి,అనిల్, సుధాకర్ బండారి పాల్గొన్నారు



## ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు,విశాలభారతి:

ప్రజల అవసరాలకు. అనుగుణంగా నిధులు కేటాయిస్తూ.. అభివృద్ధి పనులు చేపడుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారతీ నగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీలో 44 లక్ష రూపాయలతో చేపట్టనున్న పార్క్ ప్రహరీ గోడ నిర్మాణ పనులు, ఎల్ఐజీ కాలనీలో 23 లక్షల రూపాయలతో పార్కు పునరుద్ధరణ పనులు, హెచ్ఐజి కాలనీలో 28 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల పునరుద్ధరణ పనులు, రామచంద్రాపురం డివిజన్ పరిధిలో శ్రీనివాస నగర్ కాలనీలోని బాలవిహార్ పార్క్ లో 50 లక్షల రూపాయలతో చేపట్టనున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిహెచ్ఎంసి పరిధి లోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, ఐలేష్ యాదవ్, జిహెచ్ఎంసి అధికారులు, ఆయా కాలనీల అసోసియేషన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్ చెరు,విశాలభారతి

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఘనపూర్ గ్రామంలో గల శ్రీ సాయిబాబా దేవాలయం వార్షికోత్సవంలో పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఆలయ ధర్మకర్త బాసిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి నీనా చంద్రశేఖర్ రెడ్డి, పాల్గొన్నారు.




## నాచారంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

నాచారం, విశాలభారతి:

నాచారంలోని పాత గ్రామంలో ఇదివరకు 54 లక్షల రూపాయలతో సిమెంటు రోడ్డు నిర్మాణాలు చేపట్టారు. మిగిలిన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి 50 లక్షల రూపాయలు మంజూరు చేయించడం అయినది ఈ పనులను అలాగే రవీంద్ర నగర్ సాయిబాబా గుడి కమాన్ నుండి సుమారు 200 మీటర్ల మేర పాడైన రోడ్డు స్థానంలో 20 లక్షల రూపాయలతో నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేకర్ తో కలిసి శంకుస్థాపన చేయడం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ బాలకృష్ణ అసిస్టెంట్ ఇంజనీర్ కీర్తి వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, కాలనీవాసులు బారాస పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## పిల్లల కదలికలపై నిత్యం నిఘా పెట్టాలి

- భీమ్‌గల్ ఎస్సై మహేష్

బాల్కొండ,విశాలభారతి

పిల్లల కదలికలపై నిత్యం నిఘా పెట్టాలని భీమ్‌గల్ ఎస్సై మహేష్ సూచించారు. భీమ్‌గల్ మండల ప్రజలకు ఆయన పలు సూచనలు చేసారు.విద్యార్థులకు ఈ నెల 24 నుంచి సెలవులున్న నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లలను నిత్యం గమనిస్తుండలన్నారు.చెరువులు, బావుల వద్దకు ఈత,స్నానాలు వెళ్ళినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.మైనర్ బాలురకు బైక్ లు ఇవ్వకూడదన్నారు. పిల్లల కదలికలపై నిత్యం నిఘా పెట్టాలని ఎస్సై మహేష్ ప్రజలకు సూచించారు.




## ఓయూ టెక్నాలజీ కళాశాలలో ప్రారంభమైన జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్

విశాల భారతి, ఓయూ:-

ఓయూ టెక్నాలజీ కళాశాలలో మూడు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ టెక్నోస్మానియా 2025 గురువారం ప్రారంభమయింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ. జి. నరేష్ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో టెక్నోస్మానియా కన్వీనర్ ఆచార్య ఎస్. శ్రీని నాయక్ మాట్లాడుతు. మూడు రోజుల పాటు టెక్నోస్మానియా కార్యక్రమం లో నిర్వహించే కార్యక్రమములను వివరించారు. టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి. రమేష్ కుమార్ టెక్నోస్మానియా ప్రాధాన్యతను మరియు కళాశాల ప్రస్థానానం ను వివరించారు.ముఖ్య అతిథి ఓయు రిజిస్ట్రార్ ప్రొ. జి. నరేష్ రెడ్డి మాట్లాడుతు టెక్నాలజీ అనేది వివిధ రంగాలకు అవసరం అని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి టెక్నాలజీలు ఎన్నో టెక్నాలజీ విప్లవాలు సృష్టించే అవకాశం ఉంది అన్నారు. ప్రతి విద్యార్థి మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీ పరంగా కూడా అభివృద్ధి చెందాలని తెలిపారు. అందులో ముఖ్యంగా సుస్థిర టెక్నాలజీ పై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని తెలిపారు.



డీన్ ఆర్ అండ్ డి కెమికల్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ శిరీష్ హెచ్ సోనావానే అడ్వాన్స్డ్ వేస్ట్ వాటర్ ట్రీట్ మెంట్ ఇన్ కెమికల్ ప్రాసెస్ ఇండస్ట్రీస్ అనే అంశం పై కీలకోపన్యాసం చేశారు. వివిధ విభాగాల వారు టెక్నికల్ ఓరల్ మరియు పోస్టర్ ప్రెజెంటేషన్లు చేశారు.సాయంత్రం డాన్స్ లు, పాటలు మరియు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.రమేష్ కుమార్, టెక్నోస్మానియా కన్వీనర్ ఎస్. శ్రీను నాయక్, హెడ్ డిపార్ట్మెంట్ ఆఫ్ టెక్స్టైల్ టెక్నాలజీ ఆచార్య జె.హయ వదన, హెడ్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆచార్య బి.రాజం, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ లు,డా. అభిలాష్, డా.కె. శ్రీనివాసులు, డా .వి.భాస్కర్,డా. అనిత, డాడా.పరశురాం,డా. సాదం ఐలయ్య, డా.టి. జ్యోతి, డా.పి.సునిత, డా. ఎ.కవిత, డా.బి.పరమేశ్వర్లు,డా. అర్జున్డా . రేణు, డా. టి. అజిత్, స్టూడెంట్ కోఆర్డినేటర్ లు స్ఫూర్తి,అయినాల వినయ్, కవి చన్య, డి.వైష్ణవి, నంద కిషోర్, వనిత కళాశాల ఆచార్యులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## హయత్ నగర్ డివిజన్ మరింత అభివృద్ధి చేస్తాం

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:

హయత్ నగర్ డివిజన్ లోని మీదాని కాలనీలో జరుగుతున్న నూతన సీసీ రోడ్ పనులను గురువారం స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అధికారులతో పాటు కాలనీ వాసులతో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీలో మిగిలి ఉన్న వీధుల్లో కూడా సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్ కి విజ్ఞప్తి చేయడంతో వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో హయత్ నగర్ డివిజన్ మరింత అభివృద్ధి చేపట్టేలా చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఏ ఇ హేము నాయక్ , మీదాని కాలనీ అధ్యక్షులు శేఖర్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి అంజయ్య ,మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## చిర్యాల్ లో ఉగ్రవాదుల దిష్టి బొమ్మ దహనం

కీసర,విశాలభారతి:

జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో మతోన్మాద ఉగ్రవాదులు జరిపిన దాడిని కండిస్తూ దమ్మాయిగూడ మున్సిపాలిటీ చిర్యాల్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అంత కలిసి ఉగ్రవాదుల దిష్టి బొమ్మ దహనం చేయడం జరిగింది .ఈ సంధర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ కోళ్ల కృష్ణ మాట్లాడుతూ కాల్పుల్లో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాం అని అన్నారు.దేశంలో ఎక్కడ మళ్ళీ ఇలాంటి ఉగ్రవాద దాడులు జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింహాలు,జిల్లా గ్రంధాలయ సంస్థ కమిటి ఛైర్మన్ శ్రీనివాస్,జిల్లా నాయకులు,కీసర వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్ కుమార్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు జూపల్లి రవీందర్,కీసర గుట్ట ట్రస్టు బోర్డు సభ్యులు పోషబోయిన రాజు,రాగుల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.





## భూభారతిలో సమస్యలపై ఆపిల్ చేసుకునే హక్కు ప్రతి ఒక్కరికి ఉంది

- జిల్లా కలెక్టర్ గౌతం పొట్రో.
- ప్రతి గ్రామంలో భూ భారతీపై రెవెన్యూ సదస్సు ఉంటుంది.

మేడ్చల్ ,విశాలభారతి:

భూ భారతిలో భూ సమస్యల పై అపీల్ చేసుకునే హక్కు ప్రతి ఒక్క రైతుకు ఉంది ,అదేవిధంగా ప్రతి సమస్యను పరిష్కరించే అధికారం రెవెన్యూ అధికారులకు ఈ చట్టంలో కల్పించిందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం అన్నారు. గురువారం కీసర మండలంలోని చీర్యాల గ్రామంలో జయ మోహన్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం ముఖ్య అతిథిగా విచ్చేసారు.ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రైతుల సమస్యలకు పరిష్కారం తెలుపుతూ త్వరలోనే ప్రతి గ్రామంలో తహసీల్దార్లు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయడం జరగుతుంది ఆ సదస్సులో మీయొక్క వ్యక్తిగత భూసమస్యలకు సంబంధించిన అప్లికేషన్లు ఇస్తే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.పాసు బుక్కులు రానివారికి కొత్త పాసు పుస్తకాలు ఇవ్వడం అలాగే పాసుబుక్కులలో తప్పులను సవరించడంఈ భూభారతి చట్టం ద్వారా చేయవచ్చని తప్పనిసరిగా రైతుల సమస్యలు తీరుస్తామని కలెక్టరు అన్నారు.రైతులు కోరుకుంటే లైసెన్స్డ్ సర్వేయర్ల ద్వారా సర్వే చేయించి భౌతిక సరిహద్దుతో చేయించిన ల్యాండ్ మ్యాపులను ప్రభుత్వ సర్వేయర్లు మళ్లీ వాలిడేట్ చేసిన తరువాతే మీకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో ల్యాండ్ మ్యాపులు వస్తాయని, దీని వల్ల ఎవరికి నష్టం జరగదని ఇంకా పకడ్బందీగా మీ భూసరిహద్దులు ఉంటాయని, అది కూడా రైతు ఒప్పుకుంటేనే భూ సర్వే చేస్తామని కలెక్టరు తెలిపారు.ధరణి వల్ల పిఒబి సమస్యలు చాలా ఉన్నాయని భూభారతి చట్టంలో పిఓబి రద్దు చేసే అధికారం అధికారులకు కల్పించడం జరిగిందన్నారు.ఈ భూభారతి చట్టంలో ప్రతి సంవత్సరం డిసంబర్ 31న ఆ సంవత్సరంలో జరిగిన మార్పులు,చేర్పులను ఆన్ లైన్ లో ప్రింట్ తీసి ప్రతి గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులలో ప్రదర్శిస్తారని అందువల్ల మీకందరికి మీమీ భూముల రికార్డుల వివరాలు తప్పక తెలుస్తాయని కలెక్టరు వివరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని,ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు.భూ భారతి 2025 చట్టంలో 23 సెక్షన్లు మరియు 18 నిబంధనలున్నాయని తెలిపారు.భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తోందని తెలిపారు. ఇంటి స్థలాలు,ఆబాది,వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టరు తెలిపారు.ఈ సదస్సులో కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి,జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింహాలు,జిల్లా గ్రంధాలయ సంస్థ కమిటి ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కీసర తహసీల్దారు అశోక్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది,రైతులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు

విశాల భారతి
తెలుగు దిన పత్రిక





## శర్వా.. జోడి బాగుందే..

మలయాళ భామ సంయుక్త మీనన్ భీమ్లా నాయక్ తో తెలుగు ఎంట్రీ ఇవ్వగా ఆ క్రేజ్ తో సార్, విరూపాక్ష సినిమాలతో సక్సెస్ అందుకుంది. తెలుగులో మంచి పాపులారిటీ సంపాదించినట్టు అనిపించిన అమ్మడు కాస్త వెనకపడినట్టు అనిపిస్తుంది. ప్రస్తుతం నిఖిల్ తో స్వయంభు, శర్వానంద్ తో నారి నారి నడుమ మురారి సినిమాతో రాబోతుంది అమ్మడు. ఈ రెండు సినిమాలతో మళ్లీ తెలుగులో సత్తా చాటాలని చూస్తుంది సంయుక్త మీనన్. స్వయంభు సినిమా ఎక్కడిదాకా వచ్చింది అన్నది అప్డేట్ రాలేదు. అసలు ఆ సినిమా గురించి ఎవరు పట్టించుకోవట్లేదు. హీరో నిఖిల్ కూడా స్వయంభుకి సంబంధించిన ఏ విషయాలను రివీల్ చేయట్లేదు. ఇదిలా ఉంటే సంయుక్త మీనన్ శర్వానంద్ తో జత కడుతున్న నారి నారి నడుమ మురారి సినిమా ప్రమోషన్స్ మొదలు పెట్టారు. ఈ సినిమా నుంచి ఈమధ్యనే ఫస్ట్ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ సాంగ్ ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ముఖ్యంగా ఈ సాంగ్ లో శర్వానంద్, సంయుక్త మీనన్ ల జోడీ ఇంప్రెస్ చేసింది. ఇద్దరి మధ్య కెమిస్ట్రీ బాగా వర్క్ అవుట్ అయినట్టు అనిపిస్తుంది. నారి నారి నడుమ మురారి సినిమాకు విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమా నుంచి వచ్చిన ఫస్ట్ సాంగ్ కి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా సంయుక్త మీనన్ స్క్రీన్ ప్రెజెన్స్ అమె ఫ్యాన్స్ కి కిక్ ఇచ్చింది. శర్వానంద్, సంయుక్త మీనన్ ఈ ఇద్దరి కెమిస్ట్రీ పరంగా చూస్తే సినిమా బాగానే వస్తున్నట్టు అనిపిస్తుంది. ఈ సినిమాలో మరో హీరోయిన్ గా సాక్షి వైద్య నటిస్తుంది. రాం అబ్బరాజు డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా రోమ్ కోమ్ ఎంటర్టైనర్ గా వస్తుందని తెలుస్తుంది. మనమే తర్వాత శర్వానంద్ నారి నారి నడుమ మురారి సినిమాతో రాబోతున్నాడు. ఈ సినిమాతో పాటు మరో రేసింగ్ బ్యాక్ డ్రాప్ మూవీ కూడా చేస్తున్నట్టు తెలుస్తుంది. యువ హీరోల్లో ఎలాంటి కథలకైనా పర్ఫెక్ట్ గా సూటయ్యే కెపబిలిటీ ఉన్న యాక్టర్ శర్వానంద్ కెరీర్ హిట్లు ఫ్లాపుల మధ్య ఊగిసలాడుతున్నా కూడా తన ప్రయత్నాలను మాత్రం ఆపట్లేదు. మరి రాబోతున్న ఈ సినిమాలతో అయినా శర్వానంద్ సక్సెస్ ఫాం కొనసాగిస్తాడేమో చూడాలి. శర్వానంద్ నెక్స్ట్ సినిమాల్లో సోగ్గాడే చిన్ని నాయనా డైరెక్టర్ కళ్యాణ్ కృష్ణతో కూడా ఒక ప్రాజెక్ట్ డిస్కషన్ స్టేజ్ లో ఉందని తెలుస్తుంది.



## మెగా డాటర్ మళ్లీ సై అనేసిందా?

మెగా డాటర్ నిహారిక విడాకుల తర్వాత మళ్లీ మ్యాకప్ వేసుకోని సంగతి తెలిసిందే. కేవలం నిర్మాతగానే ముందుకొస్తుంది. వెబ్ సిరీస్ లు... సినిమా నిర్మాణంలో భాగమవుతూ ఇండస్ట్రీలో యాక్టివ్ గా కనిపిస్తుంది. అప్పుడప్పుడు మంచి సినిమాల్లో అవకాశాలు వస్తే ఇలా వచ్చి అలా వెళ్లిపోయే గెస్ట్ రోల్స్ మాత్రమే పోషిస్తుంది. పూర్తి స్థాయిలో రంగంలోకి దిగలేదు. అయితే అందుకు ఇక సమయం ఆసన్నమైందనే వార్త వెలుగులోకి వస్తోంది. మెగా డాటర్ స్టార్ హీరోయిన్ అయ్యే ప్రయత్నాలు మొదలు పెట్టిందని సన్నిహిత వర్గాల నుంచి లీకులందుతున్నాయి. ఇప్పటి వరకూ గిరి గీసుకుని బోర్డర్ లోనే ఉన్న నిహారికి ఇప్పుడా హద్దులు చెరిపేసి నటిగా తన ట్యాలెంట్ చూపించడానికి రెడీ అవుతుందంటున్నారు. కుటుంబ సభ్యుల నుంచి కూడా అన్ని రకాల అనుమతులు లభించడంతో? తగ్గేదేలే అంటూ బరిలోకి దిగబోతుందిట. హీరోయిన్ గా మంచి అవకాశాలు వస్తే చేయడానికి తాను సిద్దంగా ఉందనే వార్త వినిపిస్తుంది. అయితే ఆ పాత్రలు అంతే హుందాగానూ ఉండాలి. నటిగా ఇమేజ్ పెంచే పాత్రలు తప్ప గ్లామర్ పాత్రల జోలికి వెళ్లే అవకాశం లేదని... సాయి పల్లవి తరహాలో సినిమాలు చేయాలని ఓ కొత్త స్ట్రాటజీని సిద్దం చేస్తోందిట. నేరుగా హీరోయిన్ అవకాశాలంటే అగ్ర నిర్మాణ సంస్థల్లో ఎలాగూ ఇవ్వరు. దీంతో తన సొంత నిర్మాణ సంస్థలోనే ముందుగా హీరోయిన్ గా ప్రూవ్ చేసుకునే కొన్ని పాత్రలు పోషించాలని ప్లాన్ చేస్తోందిట. కొన్ని సోర్సెస్ ప్రకారం సొంత నిర్మాణ సంస్థ కాబట్టి గ్లామర్ విషయంలో కొంత లిబర్టీ తీసుకునే అవకాశం ఉందంటున్నారు. పాత్ర డిమాండ్ మేరకు అన్ని రకాలుగా న్యాయం చేయాలి అనే కోణంలో నిహారిక సిద్దమవుతుందంటున్నారు. అయితే అందుకు కొంత సమయం పడుతుందిట. నిహారిక అనుకున్నది వచ్చే ఏడాది నుంచి అమలు చేస్తుందని..అంత వరకూ వెయిటింగ్ తప్పదంటున్నారు.



## ప్రభాస్ మూవీ వల్ల ఛాన్స్!

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, హీరోయిన్ పూజా హెగ్డే కాంబోలో రూపొందిన రెట్రో మూవీ రిలీజ్ కు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించిన ఆ సినిమా.. ఇప్పటికే అన్ని పనులు పూర్తి చేసుకుంది. మే 1వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం మేకర్స్ ప్రమోషన్స్ తో ఫుల్ బిజీగా ఉన్నారు. అదే సమయంలో పూజ కూడా ఫుల్ యాక్టివ్ గా ప్రమోషన్స్ లో పాల్గొంటోంది. వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ కీలక విషయాలు షేర్ చేసుకుంటోంది. రీసెంట్ గా రెట్రో మూవీకి గాను ఫస్ట్ టైమ్ మాట్లాడేందుకు రమ్మనప్పుడు మేకప్ లేకుండా కార్తీక్ సుబ్బరాజు రమ్మన్నారని చెప్పిన విషయం తెలిసిందే. అప్పుడెంతో హ్యాపీగా ఫీలయ్యానని చెప్పింది. ఇప్పుడు పూజ షేర్ చేసిన మరో ఇంట్రెస్టింగ్ మ్యాటర్ ప్రస్తుతం వైరల్ గా మారింది. పాన్ ఇండియా స్టార్ హీరోగా నటించిన రాధే శ్యామ్ సినిమాలో పూజ ఫిమేల్ లీడ్ రోల్ పోషించిన విషయం తెలిసిందే. ఆ మూవీలోని తన యాక్టింగ్.. కార్తీక్ సుబ్బరాజ్ కు నచ్చిందని.. ఆ విషయం తెలిసి తాను షాక్ అయ్యానని పూజ తెలిపింది. రాధేశ్యామ్ లో తన రోల్ కు పండించిన ఎమోషన్స్ చూసి రెట్రో సినిమాకు తాను సరిగ్గా సరిపోతానని కార్తీక్ సుబ్బరాజ్ భావించారని పూజ తెలిపింది. అయితే రాధేశ్యామ్ మూవీ.. అనుకున్న స్థాయిలో మెప్పించలేకపోయింది. బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లు రాబట్టలేకపోయింది. కానీ ఆమె యాక్టింగ్.. ఇతర మేకర్స్ పై ముద్ర వేసిందనే చెప్పాలి. అదే సమయంలో రెట్రో మూవీ పెద్ద ఎగ్జామ్ లాంటిదని తెలిపింది పూజ. యాక్షన్, డ్యాన్స్, ఎమోషన్స్.. అన్నీ కలయికతో ప్రేక్షకులకు భిన్నమైన ఎక్స్పీరియన్స్ ను రెట్రో అందిస్తుందని హామీ ఇచ్చింది. అయితే ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ ప్రకారం.. పూజ మేకప్ లేకుండా సింపుల్ లుక్ లో సినిమాలో కనిపించనుంది. ఇక రెట్రో మూవీలో తాను చేసిన రోల్.. కెరీర్ లో కొత్త స్టేజ్ ను సూచిస్తుందని పూజా హెగ్డే తెలిపింది. ముఖ్యంగా పీరియాడికల్ మూవీలో పవర్ ఫుల్ రోల్స్ చేయాలని ఉందని తనలోని కోరిక బయటపెట్టింది అమ్మడు. ప్రేక్షకులను ఎంటర్టైన్ చేయడం తన లక్ష్యమంటూ పూజ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.